## అధ్యాయము 14

# అబ్రాహాము యుద్ధంలో కలగజేసుకొనడం మరియు ఇద్దరు రాజుల్ని కలుసుకొనడం

యొర్దాను మైదానాన్ని ఎన్నుకొనాలని మరియు సొదొమ సమీపంలో గుడారం వేసుకొనాలని లోతు నిర్ణయించుకొనడం పలు విధాలుగా విషాదకరమైనదే. ఇది అతని కుటుంబాన్ని తీవ్రమైన దుష్టత్వంతో నిండిన పరిసరాల్లోకి నెట్టివేసింది, ఈ వాతావరణం వీరికి నైతికంగా ప్రమాదస్థాయిని తెచ్చిపెట్టింది (19:1–8 చూడండి). ఇది వీరిలో, ప్రజల్ని వారి దుష్టత్వం విషయంలో లెక్క అడుగుతూ (బాధ్యుల్ని చేస్తూ), అటువంటి దుష్ట నడవడి విషయంలో పశ్చాత్తాపపడనివారికి తీర్పు తీర్చే ఏకైక నిజదేవునిపట్ల విశ్వాసం హరించిపోయేలా చేసింది (19:12–22 చూడండి). ఇది వారి జీవితాల మీద పెను ప్రభావం చూపింది; ఎందుకంటే సొదొమ ప్రాంతంలో నివసించినందువల్ల వారు తూర్పునుండి వచ్చి నలుగురు రాజులు చేసిన దాడిలో చిక్కుకున్నారు. ఈ రాజులు తమ తమ సైన్యాలతో, సొదొమ ప్రాంతంలోను ఆ పరిసరాల్లోను ఉన్నటువంటి అయిదుగురు రాజులు తమ పైన ప్రభుత్వంచేసే రాజులు కోరిన మేరకు వారికి అవశ్యంగా కట్టవలసిన వార్షిక కప్పం చెల్లించనందువలన వారి మీదకు దాడి చేశారు. కనాను సరిహద్దు ఆగ్నేయ ప్రాంతంలో ఉన్న అయిదుగురు రాజులు కేవలం చిన్న ప్రాంతాల్ని మాత్రమే పరిపాలించే రాజులు కావడం మరియు ఈ భూభాగాలు తూర్పు నుండి వచ్చిన రాజులకు అతి సమీపంలో ఉండడం వారిని బలవంతుల్ని చేసిందని స్పష్టంగా తెలుస్తున్నది. వీరు విశాలమైన ప్రాంతాల్ని పరిపాలించారు; వీరు అనేక పట్టణాల్ని తమ తమ రాజ్యాల్లో అంతర్భాగాలుగా చేసుకొని, ఆ పట్టణాలు కొంత మేరకు స్వతంత్ర స్థాయిని నిలబెట్టుకొనుటకు కప్పం కట్టేలా దౌర్జన్యపూరితంగా వ్యవహరించారు.

# రాజుల యుద్ధం (14:1–12)

**1షీనారు రాజైన అమ్రాపేలు, ఎల్లాసరు రాజైన అర్యోకు, ఏలాము రాజైన**
**కదొర్లాయోమెరు, గోయీయుల రాజైన తిదాలు అనువారి దినములలో 2వారు**
**సొదొమ రాజైన బెరాతోను, గొమొఱ్ఱా రాజైన బిర్షాతోను, అద్మా రాజైన షినాబుతోను,**
**సెబోయీయుల రాజైన షెమేబెరుతోను, సోయరు అను బెల రాజు తోను యుద్ధము**
**చేసిరి. 3వీరందరు ఉప్పు సముద్రమైన సిద్దీము లోయలో ఏకముగా కూడి**
**4పండ్రెండు సంవత్సరములు కదొర్లా యోమెరుకు లోబడి పదమూడవ**
**సంవత్సరమున తిరుగుబాటు చేసిరి. 5పదునాలుగవ సంవత్సరమున**
**కదొర్లాయోమెరును అతనితో కూడ నున్న రాజులును వచ్చి అష్తారోత్**
**కర్నాయిములో రెఫాయియులను హాములో జూజీయులను షావే కిర్యతాయిము**
**మైదానములో 6ఏమీయులను కొట్టిరి. మరియు హోరీయులను అరణ్యము**
**దగ్గరనున్న ఏల్పారాను వరకు తరిమి శేయీరు పర్వత ప్రదేశములో వారిని కొట్టిన**
**తరువాత 7తిరిగి కాదేషు అను ఏన్మిషతుకు వచ్చి అమాలేకీయుల దేశమంతటిని**
**హససోన్ తామారులో కాపురమున్న అమోరీయు లను కూడ కొట్టిరి. 8అప్పుడు**
**సొదొమ రాజును గొమొఱ్ఱా రాజును అద్మా రాజును సెబోయీము రాజును సోయరు**
**అను బెల రాజును బయలుదేరి సిద్దీము లోయలో వారితో, 9అనగా ఏలాము రాజైన**
**కదొర్లాయోమెరు, గోయీయుల రాజైన తిదాలు, షీనారు రాజైన అమ్రాపేలు,**
**ఎల్లాసరు రాజైన అర్యోకు అను నలుగురితో ఆ యైదుగురు రాజులు యుద్ధము**
**చేసిరి. 10ఆ సిద్దీము లోయలో విస్తారమైన మట్టికీలు గుంటలు ఉండెను. సొదొమ**
**గొమొఱ్ఱాల రాజులు పారిపోయి వాటిలో పడిరి. శేషించినవారు కొండకు పారిపోయిరి.**
**11అప్పుడు వారు సొదొమ గొమొఱ్ఱాల ఆస్తి యావత్తును వారి**
**భోజనపదార్థములన్నియు పట్టుకొని పోయిరి. 12మరియు అబ్రాము సహోదరుని**
**కుమారుడైన లోతు సొదొమలో కాపురముండెను గనుక అతనిని అతని ఆస్తిని**
**పట్టుకొనిపోగా.**

చారిత్రక పూర్వసమాచారం లభ్యం కానందున, తూర్పునుండి వచ్చిన నలుగురు రాజులు పశ్చిమ ప్రాంతంమీద చేసిన వృత్తాంతాన్ని కొందరు కల్పనగా (కాల్పనిక వర్ణనగా) పరిగణిస్తారు. అయితే, దీన్ని వాస్తవికమైన చారిత్రక వృత్తాంతంగా నమ్మడానికి సరైన కారణాలు కనబడుతున్నాయి. ఉదాహరణకు, గ్రంథకర్త ఏదో ఒక ప్రాచీనమైన మూలం నుండి ఈ వృత్తాంతాన్ని తీసుకొని చెబ్తున్నట్టుగానే కనబడుతుంది. గ్రంథకర్త ఈ వృత్తాంతాన్ని వ్రాసేటప్పటికి వాడుకలో లేని ప్రాచీన నామాల్ని ఉపయోగించాడు; ఈ చారిత్రక సంఘటనకు చాలా కాలం తర్వాత గ్రంథకర్త తన పాఠకుల ఉపయోగార్థం, అంటే వాడుకలో లేని ఈ పేర్లను పాఠకులు అర్థం చేసుకొనడానికిగాను వివరణాత్మకమైన పేర్లను లేదా,

విషయ పరిజ్ఞానాన్ని పొందుపర్చాడు (14:2, 3, 7, 8, 17).

**వచనము 1**. పద్నాల్గవ అధ్యాయంతో విమర్శకులకు ఎదురయ్యే సమస్యల్లో ఒకటి, పశ్చిమాన ఉన్న అయిదుగురు రాజులకు వ్యతిరేకంగా తూర్పున ఉన్న నలుగురు రాజులు ఒక యుద్ధకూటమిగా (లేక, యుద్ధం చేయడంకొరకు రాజ్య కూటమిగా) యుద్ధంలో పాల్గొన్నారని నిరపేక్షంగా వ్యక్తపర్చలేని అశక్తత అని చెప్పవచ్చు. **ఏలాము రాజైన కదొర్లాయోమెరు** తూర్పునున్న రాజుల కూటమికి నాయకుడు; పడమరనున్న అయిదుగురు రాజులు "పండ్రెండు సంవత్సరములు" ఇతని క్రింద "లోబడి" ఉన్నారు (14:4). కదొర్లాయోమెరు నోవహు కుమారుడైన షేము వంశస్థుడు; షేము ప్రథమ కుమారుడి పేరు "ఏలాము" (10:22). ఏలామీయులు ప్రాచీన పారశీక దేశంలో నివసించారు (ఇది ప్రస్తుత ఇరాన్ దేశానికి నైరుతి దిశలో ఉన్న ప్రాంతం); వీరి ముఖ్యపట్టణం (రాజధాని) షూషను.

కదొర్లాయోమెరు మిత్రరాజులు (1) **షీనారు రాజైన అమ్రాపేలు** (బబులోనుకు ప్రాచీననామం "షీనారు"), (2) **ఎల్లాసరు రాజైన అర్యోకు**, మరియు (3) **గోయీయుల రాజైన తిదాలు**. ఈ వ్యక్తుల్లో ఎవరూ ప్రాచీన పశ్చిమాసియాకు చెందిన రాజులుగా రూఢిగా (నిర్ణీతంగా, నిశ్చయాత్మకంగా) గుర్తింపు పొందడం లేదు; ఇంకా, స్థలనామాలైన "ఎల్లాసరు,"[1] "గోయీయుల" ("ప్రజలు" లేక "జాతులు" మరియు దేశాలు అని అర్థం) వంటివి ఈ పాఠ్యభాగంలో తప్ప మరెక్కడా లేవు. తూర్పు ప్రాంతంలో ఉన్న ఈ చిన్న రాజ్యాల గురించి, మరీ ముఖ్యంగా రెండవ సహస్రాబ్దిలోని తొలి సగం గురించి మన చారిత్రక పరిజ్ఞానం కేవలం అసంపూర్ణం. కాబట్టి, ఆధారం (రుజువు) లేకపోవడాన్ని, ఈ చిన్న రాజ్యాల్ని పరిపాలించిన రాజుల గురించి చారిత్రకత్వం (చారిత్రక సంఘటనల్ని ప్రతిపాదించే ప్రామాణికత్వం) లేదనేందుకు ఆధారంగా తీసుకొనకూడదు.

ఈ పేర్లు ఈ పాఠ్యభాగం నమ్మదగినదే అనడానికి మరొక కారణాన్ని చూపెడుతున్నాయి; ఎందుకంటే ఈ పేర్లకు వాస్తవికత (విశ్వసనీయమైన ప్రామాణికత) ఉంది. ఈ పేర్లకు, అబ్రాహాము కాలంలో తూర్పు దేశాల ప్రజల్లో వాడుకలో ఉన్న నామధేయాలకు అనురూపం (అనుగుణ్యం, పోలిక, సంబంధం) కనబడుతున్నది. "కదొర్లాయోమెరు" ఏలామీయుల పేరు (*Kutir* కు అదనంగా దైవం). ఈ పేరు "ఏలాము రాజైన" అతనికి సరిగ్గా సరిపోయే గౌరవసూచక నామం. "అమ్రాపేలు" సెమిటిక్ (షేము వంశానికి సంబంధించిన) పేరులాగా కనబడుతున్నది, ఈ పేరు "షీనారు రాజు"కు (బబులోను) తగిన పేరుగా కనబడుతున్నది. "అర్యోకు" హురియన్ మూలానికి సంబంధించినది; ఈ పేరుకు, ప్రాచీన నగరాలైన మారి (*Arriwuk /Arriyuk*) మరియు నూజి (*Ariukki*) మొదలైన పేర్లు సమానాంతరంగా (పోలిక కలిగి) ఉన్నాయి. "తిదాలు" హిత్తీయుల ప్రారంభకాలంలో (*Tudkhalia*) పలువురు రాజులకున్న పేరు. "గోయీయుల రాజైన" అని తిదాలు కున్న బిరుదు అనటోలియాలో[2] సర్వాధికారాలున్న

నాయకులు (తెగలకు లేక జాతులకు లేక వంశాలకు అగ్రగణ్యులైన అధిపతులు) ధరించిన బిరుదుకు దగ్గరి పోలిక ఉన్నట్టుగా కనబడుతున్నది. సుమారుగా వెయ్యి లేక పదిహేను వందల సంవత్సరాల తర్వాత జీవించిన ఇశ్రాయేలీయుడు ప్రాచీన కాలం నాటి సంస్కృతీ సంప్రదాయాలకు సరిగ్గా సరిపోయేటటువంటి ప్రామాణికమైన (విశ్వసనీయత గల) పేర్లను ఊహాజనితంగా కల్పించి వ్రాయడమనేది, ఒక పథకం ప్రకారమైనా సరే సంభావ్యమయ్యే విషయం కాదు.

**వచనము 2.** తూర్పు దేశాల కూటమి ఎవరితో యుద్ధము చేశారో వారి పేర్లను, చివరిది మినహా, తర్వాత పేర్కొనడం జరిగింది: **సొదొమ రాజైన బెరా ... , గొమొఱ్ఱా రాజైన బిర్షా ... , అద్మా రాజైన షినాబు ... , సెబోయీయుల రాజైన షెమేబెరు ... , బెల రాజు (అంటే, సోయరు)**. ఈ పట్టికలో ఒకే ఒక రాజు పేరు అంటే బెల రాజు పేరు ఎందుకు లేదో ఇతమిత్థంగా తెలియడం లేదు. ఈ పేరు లేకపోవడం ఈ పాఠ్యభాగం యొక్క విశ్వసనీయతకు క్లిష్టత కలిగించడానికి బదులు, ఈ పట్టికలోని రాజులకు అదనపు విశ్వసనీయతను జోడించింది. ఈ విషయాల్ని వ్రాసిన గ్రంథకర్త కాల్పనిక వృత్తాంతం కొరకు పేర్లను ఊహించాడని అనుకున్నట్లయితే, అతనొక పేరును ప్రస్తావించకపోవడం ఈ వృత్తాంతంయొక్క నిర్దుష్టతపట్ల (ఖచ్చితత్వం) అతనికున్న గౌరవభావాన్ని, ఈ వృత్తాంతాన్ని శ్రద్ధతో పరిరక్షించి చివరకు ఏ ఒక్క పేరు విషయంలోనైనా ఎటువంటి మార్పుల్లేకుండా మరుసటి తరానికి అందించాలనే కోరికను తెలియజేస్తుంది. బైబిల్లోని ఈ వృత్తాంతంలోని పేర్లు మరియు సంఘటనలు ఆ వ్యక్తులు ఎక్కడ పరిపాలించారో ఆ ప్రాంతాలకు సరిగ్గా సరిపోతాయి.

**వచనము 3.** ఈ నలుగురు తూర్పు రాజులు పశ్చిమ దిశగా వచ్చి, **ఉప్పు సముద్రమైన సిద్దీము లోయలో** ఎటువంటి విశేషమైన స్వతంత్రాధికారాలు లేనటువంటి అయిదుగురు రాజుల మీదకు వచ్చారు. పడమర ప్రాంతంలోని ఈ అయిదు నగరాలు (14:2), “సిద్దీము లోయ” ఉన్న నిర్ణీత ప్రదేశాల్ని గుర్తించడం సాధ్యం కాని విషయం; ఇవి మృత (ఉప్పు) సముద్రపు దక్షిణ కొనలో[3] ఉండేవనేది సర్వసాధారణమైన అభిప్రాయం (14:8–10 వివరణలు చూడండి).

**వచనము 4.** అయిదుగురు చిన్న రాజులు **పండ్రెండు సంవత్సరములు పాటు కదొర్లాయోమెరుకు** నమ్మకంగా లోబడి ఉన్నారనీ, అయితే **పదమూడవ సంవత్సరము** రాగానే వీరందరు ... తిరుగుబాటు చేసిరి అనీ గ్రంథకర్త ప్రస్తావించాడు. అంటే, వీరు తమపై అంతిమ రాజ్యాధికారం ఉన్న అధిపతికి (రాజు) వార్షిక కప్పం పంపడానికి నిరాకరించారని అర్థం (2 రాజులు 18:7, 13–16 చూడండి).

**వచనములు 5–7. పదునాలుగవ సంవత్సరము** రాగానే **కదొర్లా యోమెరు** మరియు అతని కూటమిలోని వారు పడమరమీద దాడిచేశారు. ఎందుకు ఏలాము రాజు తిరుగుబాటుచేసిన సామంత రాజుల మీదకు దాడి చేయడానికి

"పదునాలుగవ సంవత్సరము" వరకు వేచి ఉన్నాడు? బహుశా వీరు తాము చేసినదానికి రాబోయే తీవ్రమైన పరిణామాలగురించి పునరాలోచించుకొనడానికి కొంత సమయం ఇచ్చి ఉండవచ్చు. మరొకటి కూడా అయ్యుండవచ్చు, పశ్చిమాన ఉన్న నగరరాజ్యాలమీద విజయం సాధించడం కొరకు కావలసిన సైన్యాన్ని సమకూర్చుకొనడానికి, సుదీర్ఘకాలం పాటు ధనవ్యయంతో కూడుకున్న దండయాత్రకు కూటమిలోని మిత్రుల్ని ఒప్పించి వారిని సంసిద్ధుల్ని చేయడానికి కూటమి నాయకుడికి సమయం పట్టి ఉండవచ్చు.

తూర్పు రాజుల సంకీర్ణ కూటమి మొదటగా యొర్దానుకు తూర్పున మధ్యభాగంలోని పర్వతపంక్తుల మీద దాడిచేశారు, తర్వాత ఉత్తరంనుండి దక్షిణదిశగా "రాజమార్గమున" కదిలారు (సంఖ్యా. 20:17; 21:22 చూడండి). ద్వితీయోపదేశకాండము ప్రారంభ అధ్యాయాల ప్రకారం, తర్వాతి కాలంలో ఇశ్రాయేలీయులు తూర్పునుండి వెళ్లి కనానును ముట్టడించి యెరికోను స్వాధీనపర్చుకొనడానికి, యొర్దాను నది దాటక ముందు ఇదే మార్గంలో వ్యతిరేక దిశలో, అంటే దక్షిణంనుండి ఉత్తరం వైపు వెళ్లారు. 14:5–7 వచనాల్లో, యుద్ధ ప్రారంభంలో తూర్పునుండి వచ్చిన రాజులు ఏ ప్రదేశాల మీద దాడిచేశారో ఆ పట్టికలో కనబడుతుంది.

**అష్తారోత్ కర్నాయిములో రెఫాయీయులను**: గలిలయ సముద్రానికి తూర్పున బాషానులో ఉన్న పట్టణం కర్నాయిము దగ్గర అష్తారోత్ (నేడు దీని పేరు టెల్ అష్తారా; ఇది దక్షిణ సిరియా సరిహద్దుల్లోపల ఉంది). అబ్రాహాము కాలం తర్వాత, రెఫాయీయులు బలవత్తరమైన ప్రజ (భీకరమైన, పటిష్టమైన) అయ్యారు; ఇశ్రాయేలీయులు కనానును స్వాధీనం చేసుకొనడానికి వీరిని ఓడించవలసి వచ్చింది. బాషాను ప్రాంతంలో వీరి జనసాంద్రత ఎక్కువ. వీరిలో కొందరు బాగా ఎత్తైనవారని లేఖనాలు సూచిస్తున్నాయి (ద్వితీ. 2:10, 11, 20, 21). వీరిలో చివరి రాజు ఓగు; ఇతని మంచం తొమ్మిది మూరల పొడుగు (అంటే పదమూడు అడుగుల కంటె ఎక్కువ) ఉండేది (ద్వితీ. 1:4; 3:10, 11).

**హాములో జూజీయులను**: వీరి గురించి బైబిల్లోని ఈ వాక్యభాగంద్వారా మాత్రమే తెలుస్తున్నది. కొందరు వీరిని ద్వితీ. 2:20 లోని జంజుమ్మీయులతో జతచేసి పరిగణిస్తారు. ఈ విధంగా జత చేయడానికి మృతసముద్రపు చుట్టల్లోని ఒక గ్రంథం ఆధారం; దీనిలో వీరిని "అమ్మోనులో ఉన్న జంజామీయులు"[4] అని సూచించడం జరిగింది. ఏది ఏమైనప్పటికీ, హాము గిలాదులో బాషానుకు మోయాబుకు మధ్యన ఉన్న ప్రదేశం. కొందరు దీన్ని టెల్ హాము అనే ప్రదేశంగా గుర్తిస్తారు; ఇది ప్రాచీన "రాజమార్గము" సమీపంలో యొర్దాను ప్రాంతంలో ఇర్బిద్‌కు నైరుతిలో కొన్ని మైళ్ల దూరంలో ఉంది.

**షావే కిర్యతాయిము మైదానములో ఏమీయులను**: "షావే" (שָׁוֵה, *Shaweh*) అనే పేరుకు "మైదానం" లేక "లోయ" అని అర్థం. కాబట్టి, ఇది ఉత్తర మోయాబులో

మైదానప్రాంతంలో కిర్యతాయిము దగ్గర ఉన్న పట్టణాన్ని సూచిస్తుంది (సంఖ్యా. 32:37; యెహో. 13:19; యిర్మీయా 48:1, 23; యెహెజ్కేలు 25:9). కిర్యాతాయిము ఉన్న ఖచ్చితమైన ప్రదేశం ఏదో తెలియదు.

**హోరీయులను అరణ్యము దగ్గరనున్న ఏల్పారాను వరకు**: మృత సముద్రానికి అరాబా సింధుశాఖకు (అఖాతానికి) మధ్య ఉన్న పర్వతప్రాంతం శేయీరు (ద్వితీ. 2:12, 22); ఎదోమీయులు ఈ ప్రాంతంలో ప్రవేశించి స్థిరపడడానికి పూర్వం ఇక్కడ హోరీయులు నివసించారు. తూర్పు రాజులు వీరిని "ఏల్పారాను వరకు" తరిమికొట్టి ఓడించారని పాఠ్యభాగం చెప్పడంతో, ఏలతు వరకు (ప్రస్తుత ఐలత్)[5] వెళ్లారని కనబడు తుంది. ఏలతు సమీపంలోనే ఎసోన్గెబెరు ఉంది; తదుపరి కాలంలో పాత నిబంధన చరిత్రలో అరాబా అఖాత తీరంలో ఏలతు ఒక ప్రముఖమైన పట్టణమయ్యింది (సంఖ్యా. 33:35; ద్వితీ. 2:8; 1 రాజులు 9:26–28; 10:11–22).

తూర్పు సైన్యాలు వాయవ్యంవైపు **తిరిగి ఏన్మిష్పతుకు** వచ్చిరని ఉంది, ఇదే తదుపరి కాలంలో **కాదేషు** (కాదేషు బర్నేయ) అని పేరుపొందింది. ఇశ్రాయేలీయులు కనాను దేశం ఎలా ఉంటుందో, అక్కడ ఉన్న ప్రజలెటువంటివారో వేగుచూడడానికి వచ్చినప్పుడు వారు బస చేసిన ఒయాసిస్ (ఎడారి నీటిచెలమ) ప్రాంతం ఇదే (సంఖ్యా. 13:26; 20:22). ఇది వాగ్దాన దేశానికి దక్షిణ సరిహద్దు. ఈ ప్రాంతంలో నలుగురు రాజులు **అమాలేకీయుల దేశమంతటిని జయించారు**. వీరు సంచారజాతి ప్రజలేయైనా పూర్తిగా సంచారులు కాదు, వీరి గురించి బైబిల్లో తప్ప వెలుపల మరెక్కడా వివరాలు లభ్యం కావు; అయితే ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడిచిపెట్టిన తర్వాత సీనాయి అరణ్యంలో ఉన్నప్పుడు వీరిమీద అమాలేకీయులు దాడి చేశారు (నిర్గమ. 17:8–16). ఇశ్రాయేలీయుల నలభై సంవత్సరాల అరణ్యప్రయాణం ముగింపు దశలో, బిలాము దేవోక్తిలో ఎదోమీయులకు వచ్చే తీర్పులో వారితోబాటు అమాలేకీయులు కూడా ఉన్నారు (సంఖ్యా. 24:18–20). చివరికి, సౌలు మరియు దావీదు వీరి మీద అంతిమవిజయం సాధించారు (1 సమూ. 15; 27; 30).

**హససోను తామారులో కాపురమున్న అమోరీయులను**: ఈ ప్రదేశం 2 దిన. 20:2లో ఏన్గెదీగా గుర్తింపు పొందింది. మృత సముద్రపు పశ్చిమ తీరంలో సమృద్ధిగా నీటిచెలమలున్న(ఒయాసిస్) ప్రదేశమిది; తదుపరి కాలంలో దావీదు అతని మనుషులు సౌలు సైన్యంబారిన పడకుండా పారిపోయి దాగుకున్న స్థలం ఇదే (1 సమూ. 23:29; 24:1). అబ్రాహాము స్థిరపడిన స్థలమైన హెబ్రోనులో "మమ్రే దగ్గరనున్న సిందూరవృక్ష వనము" సమీపంలోనే ఏన్గెదీ ఉంది (14:13). కాబట్టి, పితరుడికి ఆ ప్రాంతంవారైన[6] అమోరీయులు మిత్రులై ఉండవచ్చనడం సహేతుకమైనదే; తూర్పునుండి వచ్చిన కూటమి లోతును సొదొమ ప్రజల్ని మరియు "సొదొమ గొమొఱ్ఱాల ఆస్తి యావత్తును" (14:11–16) పట్టుకొని

వెళ్లినప్పుడు వారిని తరిమికొట్ట డానికి అబ్రాహాముకు సహాయపడినది వీరే.

తూర్పు రాజులు, తమకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన అయిదుగురు రాజులకు చెందిన నగరాలకు నలుదిక్కుల్లోను అంటే ఉత్తరం తూర్పు దక్షిణం పడమర దిక్కుల్లో ఉన్న ఈ ఆరు బృందాలపైకి (జాతుల పైకి) ముందుగా ఎందుకు దాడిచేశారో ఆదికాండము వివరించడం లేదు. బహుశా వీరు, పశ్చిమ ప్రాంతాలపైన మెసొపొతమియ అధీనాన్ని (నియంత్రణను) వ్యతిరేకించిన ఒక పెద్ద తిరుగుబాటు బృందంలో ఉన్నవారైనా కావచ్చు, లేదా తిరుగుబాటు బృందంలో ఉండవచ్చనే అనుమానం కూడా కారణం కావచ్చు. తమకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినవారిచుట్టూ ఉన్న జాతులమీద దాడిచేయడానికి తూర్పు రాజులకున్న కారణా లేవైనా గానీ, ఈ నలుగురు రాజులు చేసిన దాడుల మూలంగా కలిగిన విధ్వంసంగురించి ప్రజలు వినడంవలన ఈ అయిదు నగర రాజ్యాల్లో తీవ్రస్థాయిలో భయాందోళనలు కలిగాయి.

**వచనములు 8–10**. తిరుగుబాటు చేయడానికి సంసిద్ధమైన (లేక, చేసిన) ఆరు నగరాల్ని నలుగురు తూర్పు రాజులు ఓడించిన తర్వాత, వారికి సామంతులుగా ఉండి ఇప్పుడు వ్యతిరేకించిన తిరుగుబాటు రాజ్యా లతో యుద్ధం చేశారు. సొదొమ, గొమొఱ్ఱా, అద్మా, సెబోయీము, మరియు బెల (అంటే సోయరు) మొదలైన రాజ్యాలకు రాజులైన అయిదుగురు ఆశ్చర్యం కలిగించే ధైర్యసాహసాలతో తమ మీద దాడికి వచ్చిన కదొర్లాయోమెరు, తిదాలు, అమ్రాపేలు, అర్యోకులతో యుద్ధం చేయడానికి సన్నద్ధులయ్యారు. అనాలోచితమైన ఈ వ్యూహం బెడిసికొట్టింది. అయిదుగురు కలిసి నలుగురిమీదకు వెళ్లడాన్నిబట్టి పశ్చిమాన ఉన్న రాజులు వారి సైన్యాలు యుద్ధంలో విజయం సాధించగలరని భావించవచ్చేమో గానీ, తూర్పునుండి వచ్చిన శక్తిమంతులైన రాజులకు సాటి కాలేకపోయారు. పశ్చిమ ప్రాంతపు సైన్యాలు సిద్దీము లోయలో ఓడిపోయాయి (14:3 చూడండి).

ఆ సిద్దీము లోయలో విస్తారమైన మట్టికీలు గుంటలు ఉండెను అనే వివరణాత్మక వచనం కనబడుతుంది. “తారు” లేక “శిలాజిత్తు” (కీలు) సహజప్రక్రియలో ఆర్ద్రీకరణకు గురై ఖనిజంగా మారిన ఒక కర్బన పదార్థం (హైడ్రో కార్బన్ సబ్‌స్టాన్స్); దీన్నేమట్టికీలు (ఆస్ఫాల్ట్) అని పిలుస్తారు. మధ్య ప్రాచ్యంలో ఇది పలు చోట్ల ఖనిజరూపంలో లభిస్తుంది; కొన్ని సార్లు ఈ ఖనిజద్రవం భూగర్భంనుండి ఉబికి పైకి పొంగడం జరుగుతుంది. బాబెలు గోపుర నిర్మాణంలో వెలుపలివైపు కాల్చిన ఇటుకల్ని పేర్చడానికి ఈ మట్టికీలునే అడుసుగా (మిశ్రణంగా) ఉపయోగించారు (11:3). అబ్రాహాము పుట్టి పెరిగిన ఊరు పట్టణంలో ఒకప్పుడున్న గొప్ప కట్టడమైన జిగ్గొరాట్ నిర్మాణంలో కూడా వెలుపలి గోడలకు ఈ పదార్థాన్నే ఉపయోగించారు.[7] ఈ కారణంగా, ఇప్పుడు యుద్ధం జరిగిన సిద్దీము లోయ మృత సముద్రపు దక్షిణ కొన సమీపంలో ఉండేదని పండితుల నమ్మకం.

మొదటి శతాబ్దంలో జోసిఫస్ అనే చరిత్రకారుడు మృతసముద్రాన్ని "ఆస్ఫాల్టైటిస్ సరస్సు"[8] అని పిలిచాడు; ఎందుకంటే ఆస్ఫాల్ట్ (శిలాజిత్తు, బిట్యుమిన్) పెద్ద పెద్ద ముద్దలుగా మృత సముద్రంలోని నీటి ఉపరితలంపైన తేలుతూ ఉండేవి; ఆధునిక (ప్రస్తుత) కాలంలో కూడా అప్పుడప్పుడూ ఇవి కనబడుతుంటాయనే సమాచారం కూడా ఉంది.[9]

సొదొమ గొమొఱ్ఱాల రాజులు భయపడి పారిపోయి మట్టికీలు గుంటల్లో పడిరి అని వర్ణన కొనసాగు తుంది. వారు వాటిలో పడి మరణించి ఉంటారని సహజంగానే ఊహించుకోవచ్చు; అయితే ఒక విషయం, సొదొమ రాజు ప్రస్తావన మళ్లీ 14:17 వచనంలో కనబడుతుంది. ఈ విషయాన్ని అర్థం చేసుకొనడం కష్టమేమీ కాదు, ఎందుకంటే נָפַל (*napal*, "fell") అనే హెబ్రీ క్రియాపదం ఒక వ్యక్తి తనకు తానుగా ముందుకు వచ్చి లొంగిపోవడమనే భావనను కూడా వ్యక్తం చేస్తుంది. ఉదాహరణకు, 24:64 వచనంలో ఒంటె పైనుండి రిబ్కా క్రిందకు "దిగి" (*napal*) నప్పుడు కూడా ఈ పదమే కనబడుతుంది. ఈ అర్థంతోనే ఈ క్రియాపదాన్ని 14:10 వచనంలో ఉపయోగించి ఉన్నట్లయితే, సొదొమ గొమొఱ్ఱాల రాజులు అక్కడిక్కడే చావు బారిన పడకుండా తప్పించుకొని దాక్కొనడానికి ఉద్దేశపూర్వకంగానే మట్టికీలు గుంటల్లోకి దూకి ఉండవచ్చు (యెహో. 10:16 చూడండి). ఇందుకు భిన్నంగా, ఈ క్రియాపదానికున్న సాధారణమైన అర్థాన్ని తీసుకున్నట్లయితే, ఈ రాజులు మట్టికీలు గుంటల్లో పడి మరణించడంతో, వారి ప్రజలు వెంటనే క్రొత్త రాజుల్ని నియమించుకున్నారని అర్థం చేసుకొనవచ్చు. ఏది ఏమైనా, అబ్రాహాము సొదొమ ప్రజల్ని అపాయంనుండి రక్షించినప్పుడు సొదొమ రాజు అబ్రాహాముతో మాట్లాడాడు (14:17). జరిగినదేదైనప్పటికీ, అయిదుగురు రాజుల ఓటమికి ముగింపు పలకాలి. శేషజనం (మిగిలిన ప్రజలు) కొండకు పారిపోయిరి అని ఉంది.

**వచనములు 11, 12.** నలుగురు రాజులు విజయోత్సాహంతో యుద్ధంలో తాము దోచుకున్నవాటన్నిటిని పట్టుకొని వెళ్లారు. వీటిలో **సొదొమ గొమొఱ్ఱాల ఆస్తి యావత్తును వారి భోజన పదార్థములన్నియు ఉన్నాయి**; వీటితోబాటు ఆయా ప్రజలు కూడా ఉన్నారు. పైగా, ఆ కాలంలో **అబ్రాము సహోదరుని కుమారుడైన లోతు సొదొమలో కాపురముండెను** కాబట్టి అతని మనుషులనందరినీ అతని ఆస్తి యావత్తును పట్టుకొని వెళ్లారు. ఇది లోతు గురించి ఒక క్రొత్త సమాచారం. చివరగా మనకు లోతు గురించి మనకు తెలిసినది "సొదొమ దగ్గర తన గుడారము వేసికొనెను" (13:12) అనే ప్రస్తావన మాత్రమే. ఇప్పుడతను ఆ పట్టణంలోనే నివసించాడు కాబట్టి, యుద్ధం ఇతనికి సంబంధించినది కానప్పటికీ అతనూ అతని పరివారం, తూర్పు రాజు లకు వ్యతిరేకంగా సొదొమ ప్రజలు అనాలోచితంగా చేసిన తిరుగుబాటు ఫలితంగా ఎదురైన పర్యవసానాన్ని అనుభవించ వలసి వచ్చింది.

## అబ్రాహాము లోతును మరియు చెరపట్టబడిన

## ఇతరుల్ని రక్షించడం (14:13–16)

**[13]తప్పించుకొనిన యొకడు వచ్చి హెబ్రీయుడైన అబ్రామునకు ఆ సంగతి తెలిపెను. అప్పుడతడు ఎష్కోలు సహోదరుడును ఆనేరు సహోదరుడునైన మమ్రే అను అమోరీయుని ఏలోను వనములో కాపుర ముండెను. వీరు అబ్రాముతో నిబంధన చేసికొనినవారు. [14]అబ్రాము తన తమ్ముడు చెరపట్టబడెనని విని తన యింట పుట్టి అలవరచబడిన మూడువందల పదునెనమండుగురిని వెంటబెట్టుకొని దానుమట్టుకు ఆ రాజులను తరిమెను. [15]రాత్రివేళ అతడును అతని దాసులును వారికెదురుగా మొనలు తీర్చి వారిని కొట్టి దమస్కునకు ఎడమతట్టున్న హోబా మట్టుకు తరిమి [16]ఆస్తి యావత్తు తిరిగి తెచ్చి తన తమ్ముడైన లోతును అతని ఆస్తిని స్త్రీలను ప్రజలను తిరిగి తీసికొని వచ్చెను.**

**వచనము 13.** మృతసముద్రపు నలుదిక్కుల్లో అంటే ఉత్తరం తూర్పు దక్షిణం మరియు పశ్చిమం దిక్కుల్లో యుద్ధాలు జరుగుతున్నాయని అబ్రాహాముకు ఖచ్చితంగానే తెలుసు. అయితే, మమ్రే అను అమోరీయుని ఏలోను వనములో అబ్రాహాము కాపురముండెను గనక **తప్పించుకొనిన యొకడు వచ్చి చెప్పే వరకు** అబ్రాహాముకు సొదొమ గొమొఱ్ఱా పట్టణాల్లోని పరిస్థితి గురించి ఎటువంటి వార్త తెలియదు (13:18 చూడండి). లోతుకు అతని కుటుంబానికి ఎదురైన దురదృష్టం గురించి ఈ మనిషి అబ్రాహాముకు తెలిపాడు. తూర్పు సైన్యాల దాడుల్లో మైదాన ప్రాంతంలోని నగరాలకు ఘోరపరాజయం ఎదురైందని, అక్కడున్న ప్రజల్ని బందీలుగా పట్టుకున్నారని, వారిలో లోతు కూడా ఉన్నాడని, వారి యావదాస్తుల్ని భోజన పదార్థాల్ని వారికున్నవాటన్నిటిని పట్టుకొని వెళ్లారని ఈ మనిషి అబ్రాహాముకు వార్త నందించాడు.

తప్పించుకొని వచ్చిన మనిషి **హెబ్రీయుడైన అబ్రామునకు** చెడువార్త నందించాడని ఈ వర్ణన తెలియజేస్తున్నది. వాస్తవానికి, ఈ పదబంధం (హెబ్రీయుడైన అబ్రాము) అతణ్ణి "మమ్రే" ఎష్కోలు[10] మరియు ఆనేరు అనే అమోరీ సహోదరులనుండి వేరుచేసి చూపించడం కొరకే. పాత నిబంధనలో తొలిసారిగా ఇక్కడ "హెబ్రీ" (עִבְרִי, *'Ibri*)[11] అనే పదం, అది కూడా అబ్రాహాము నుద్దేశించి ఒకసారి మాత్రమే కనబడుతున్నది. తర్వాత ఈ పదం యోసేపు కథలోను (39:14; 40:15; 41:12; 43:32) మరియు ఇశ్రాయేలీయుల చరిత్రలోను (నిర్గమ. 1:15; 2:6; 11; 1 సమూ. 4:6; 13:3, 19; 14:11; 29:3; యిర్మీయా 34:9; యోనా 1:9). ఈ పదాన్నెప్పుడూ అబ్రాహాము సంతానానికి ఇతర జాతుల ప్రజలకు మధ్య భేదాన్ని చూపడానికి ఉపయోగించారు.

"హెబ్రీ" మరియు "హబీరు" (కొన్నిసార్లు "హపీరు" లేక "అపీరు" అనే

శబ్దోచ్చారణ ఉంది) అనే పేర్ల మధ్య ఉన్న సామ్యం (పోలిక) కారణంగా, అప్పుడప్పుడూ ఈ రెండు జాతుల ప్రజల్ని కలిపి చెప్పడం జరుగుతుంటుంది. క్రీస్తు పూర్వం ఇరవయ్యో శతాబ్దంనుండి పదకొండవ శతాబ్దంవరకు ప్రాచీన పశ్చిమాసియా అంతటా హబీరు అనే ప్రజలగురించి ప్రస్తావన గ్రంథాల్లో కనబడుతుంది. వీరు ఒక ప్రదేశంనుండి మరొక ప్రదేశానికి తరలి వెళ్తూ, ప్రతి చోట పరాయివారిగానే పరిగణించబడిన జాతివిశిష్ఠతలేని సమ్మిళిత జాతుల ప్రజలు. కొన్నిసార్లు వీరు శరణార్థులుగాను (కాందిశీకులు, పారిపోయి వచ్చినవారు), మరియు కొల్లగొట్టి దోచుకొనిపోయే దోపిడి ముఠాలుగాను ఉండేవారు. ఈ జాతుల్లోనివారు చిన్న చిన్నపట్టణాల్ని నగరరాజ్యాల్ని పరిపాలించేవారి సైన్యాల్లో కిరాయి సైనికులుగా (కూలి సిపాయిలు) ఉండేవారు. తదుపరి కాలంలో కనానును స్వాధీనపర్చుకున్న ఇశ్రాయేలీయుల్ని కనానీయులు హబీరు ప్రజలుగానే పరిగణించి ఉండవచ్చు. ఏది ఏమైనా, హెబ్రీయుల్ని హబీరు ప్రజలతో కలిపి చెప్పడమనేది ఆగిపోయింది (విడిచిపెట్టబడింది); ఎందుకంటే, హెబ్రీయులు విస్తరించి ఒక జాతిగా ఆవిర్భవించడానికి వందల సంవత్సరాల పూర్వం, పశ్చిమాసియా గ్రంథాల్లో హబీరు ప్రజల ప్రస్తావన కనబడుతుంది. హెబ్రీయులు ఐగుప్తులో బానిసత్వంలో ఉన్నప్పుడే, లేక అరణ్యసంచారాల కాలంలోనే,[12] వీరు కనాను మీద దాడి చేశారు.

సొదొమ గొమొఱ్ఱాల ఓటమి, లోతు మరియు అతని కుటుంబం చెరపట్టబడడం అబ్రాహాముకు విషాదకరమైన గట్టి దెబ్బనే కొట్టింది; అయితే అప్పటికే అబ్రాహాము, ముగ్గురు సోదరులైన మమ్రే ఎష్కోలు, ఆనేరు అనే అమోరీయులతో ఎదురుదాడుల్లేకుండా మైత్రి (స్వీయరక్షణ కొరకు స్నేహ సంబంధం) చేసుకున్నాడు. అబ్రాహాముకున్నట్టుగానే, ఈ ముగ్గురి అమోరీయులకు కూడా సేవకులున్నారు; వీరి గురించి పాఠ్యభాగంలో వీరు **అబ్రాహాముతో నిబంధన** చేసికొనినవారు అని ఉంది.

"మిత్రులు" అనే భావాన్నిఎత్తిచూపే హెబ్రీ పదబంధమైన בַּעֲלֵי בְרִית (*ba*$^{a}$*ley b*$^{e}$*rith*), అక్షరాలా "నిబంధనా పూర్వకమైన ఒప్పందం చేసుకొనినవారు"[13] లేక "సంధి లేక ఒడంబడికకు కట్టుబడినవారు"[14] అనే అర్థాన్నిస్తుంది. హెబ్రీ పదమైన *b*$^{e}$*rith*, రెండు పక్షాల మధ్య ఉన్న ఆమోదయోగ్యమైన ఒప్పందాన్ని లేక "నిబంధన"ను సూచించే సంవిధాన నామం (నియత నామం). దేవుడు నోవహుతో నిబంధన చేసినప్పుడు ఆయన ఉపయోగించిన పదం (6:18; 9:9–16), మరియు అబ్రాహాముతో చేసే పలు నిబంధనల్లో కూడా ఉపయోగించే పదం ఇదే (15:18; 17:2, 4, 7, 9, 10). తదుపరి శతాబ్దాల్లో, ఇశ్రాయేలీయులు యెహోవాను సేవించడానికి బదులు ఇతర దైవాల్ని సేవించేలా వారి హృదయాల్ని అమోరీయులు త్రిప్పివేయగలరనే కారణంతో, ఇశ్రాయేలీయులు కనానులో ఉన్న అమోరీయులతో నిబంధనలు (ఒప్పందాలు, ఒడంబడికలు) చేసికొనడాన్ని మోషే

ధర్మశాస్త్రం నిషేధించింది (ద్వితీ. 7:1–4). అబ్రాహాము విషయంలో ఇటువంటి సమస్య తలెత్తదు; అతను గెరారు రాజుతో నిబంధన చేసికొని, నిబంధనపట్ల నమ్మకంగా ఉంటానని దేవుని యెదుట ప్రమాణం చేశాడు (20:1, 2; 21:22–24).

అమోరీయులైన ముగ్గురు సహోదరులు తమ దేశంలో ఉన్న పరదేశితో (పరాయి వ్యక్తితో) నిబంధన చేసికొనడానికి ఎందుకు సిద్ధపడ్డారు? ఈ ప్రశ్నకు నిర్దిష్టమైన (నిర్ణీతమైన) జవాబు బైబిలు ఇవ్వడడంలేదు గానీ, వారి నిర్ణయానికి పలు కారణాలుండవచ్చు. (1) బహుశా వారు, అబ్రాహాము ధనవంతుడు మరియు తన స్వంత ప్రయోజనాల్ని కాపాడుకొనడానికి ఎదురొడ్డి పోరాడగల విస్తారమైన దాసదాసీజనం ఉన్న శక్తిమంతుడని భావించి ఉండవచ్చు. (2) అబ్రాహాము మరియు అతనితో ఉన్న పరివారం ఇటీవలె ఐగుప్తు నుండి గణనీయమైన సంపదలతో, అంటే బానిసలతో బంగారంతో పశువుల మందలతో తిరిగి వచ్చాడని తెలిసి అప్రమత్తమై ఉండవచ్చు. ఇదంతా ఎలా జరిగిందో తెలియకపోయినా, ఐగుప్తులోని ప్రముఖ వ్యక్తి, ఫరోనే కావచ్చు, అబ్రాహామును గౌరవించి ఉండవచ్చని ఊహించుకొని ఉండవచ్చు. (3) వారు అబ్రాహామును కలుసుకొన్నప్పుడు, అతను మెసొపొతమియను విడిచిపెట్టి కనాను దేశానికి వెళ్లాలని, అక్కడ అతణ్ణి అతని సంతానాన్ని ఆశీర్వదిస్తానని, అతను తనను కలుసుకొన్నవారందరికీ ఆశీర్వాదంగా ఉంటాడని దేవుడు తనను పిలిచిన సంగతి గురించి వారితో చెప్పి ఉండవచ్చు. అమోరీ సోదరులు అబ్రాహాముతో నిబంధన చేసికొనడానికి, అతనితోబాటు యుద్ధంలో పాల్గొనడానికి, వారి పక్షంగా అబ్రాహాము మధ్యవర్తిత్వం వలన ఆశీర్వాదాల్ని పంచుకొనడంకొరకు వీటిలో ఏ ఒక్కటైనా లేక అన్నీయైనా కారణం కావచ్చు (14:19, 20, 24 చూడండి).

**వచనము 14**. తన తమ్ముడు లోతు (లోతు కుటుంబం మరియు యావదాస్తి) **చెరపట్టబడెనని అబ్రాహాము విని**[15] **నప్పుడు** వెంటనే ఈ క్లిష్టపరిస్థితి పట్ల స్పందించి, తన ఇంట్లోనే పుట్టి **అలవరచబడినవారిని వెంటబెట్టుకొని** వెళ్లాడు. חָנִיךְ (*chanik*) అనే హెబ్రీ పదం "అలవర్చబడిన" అనే అర్థాన్నిస్తుంది; ఇది పాత నిబంధనలో ఒక్కసారి మాత్రమే కనబడుతుంది. ఈ పదం, అబ్రాహాము కాలంనాటికి (క్రీస్తు పూర్వం రెండవ సహస్రాబ్ది తొలి సగం), బహిష్కరణకు గురైన ఐగుప్తు సాహిత్యగ్రంథాల్లో పేర్కొన్న పాలస్తీనాలోని చిన్న రాజులతో (అనాగరిక తెగల నాయకులు) చేతులు కలిపిన "సాయుధులైన అనుచరుల్ని" (దుండగుల్ని) సూచిస్తుండ వచ్చు.[16] అయితే ఇక్కడ కనిపిస్తున్న మూడువందల పద్దెనిమిదిమంది మనుషులు అబ్రాహాము వెల చెల్లించి కుదుర్చుకున్న కిరాయి సైనికులు (కూలి సిపాయిలు) కాదు. ఇందుకు భిన్నంగా, వీరు అబ్రాహాము యింట పుట్టినవారు; వీరి తల్లిదండ్రులు తమ యజమాని మెసొపొతమియ నుండి కనానుకు ప్రయాణంచేసి రావడానికి చాలా సంవత్సరాల పూర్వమే అతనికి సేవకులై ఉండవచ్చు. వీరిని, అబ్రాహాము ఐగుప్తురాజు ఫరో నుండి బహుమానంగా

పొందిన సేవకులనుండి వేరుచేసి చూడవలసి ఉంటుంది; ఎందుకంటే ఐగుప్తు సేవకులు కొద్ది కాలంనుండి మాత్రమే అబ్రాహాముతో ఉన్నారు. పితరుడు కేవలం ధనవంతుడు మాత్రమే కాదు గానీ, శక్తిమంతుడైన నాయకుడు (షేక్) కూడా. అతని పరివారంలో వెయ్యిమంది కంటె ఎక్కువే ఉండేవారు. అతనివద్ద ఉన్న మూడువందల పద్దెనిమిదిమంది మనుషులు యుద్ధం చేయడంలో పేరెన్నిక కలిగిన యోధులు.

అబ్రాహాము, అతని మనుషులు దాను మట్టుకు ఆ రాజుల్ని తరిమెను అని ఉంది. దాను పూర్వ నామం "లాయిషు" (లేక, "లెషెము"). న్యాయాధిపతుల కాలం వచ్చిన తర్వాతనే దాను గోత్రంవారు ఈ పట్టణాన్ని పట్టుకొని దానికి క్రొత్త పేరు పెట్టారు (న్యాయాధి. 18:29; మరియు యెహో. 19:47 చూడండి). కొంతకాలం తర్వాత నకళ్లు వ్రాసిన ఒక లేఖకుడు (లేఖరి, శాస్త్రి, పండితుడు), అతని పాఠకులు అబ్రాహాము కాలంలో ఈ యుద్ధం ఖచ్చితంగా ఎక్కడ జరిగిందో తెలుసుకొనగలిగేలా ఆదికాండము గ్రంథంలో "లాయిషు" అనే పేరుకు "దాను" అనే వర్తమాన నామాన్ని (ఆధునిక నామాన్ని) ఇవ్వడం జరిగింది.

**వచనము 15**. అబ్రాహాము, అతని **మనుషులు మొనలు తీర్చి** (వ్యూహాత్మకంగా నిల్చి), హఠాత్తుగా శత్రువుల్ని **రాత్రివేళ** కొట్టి తరిమారు. తదుపరి కాలంలో ఇశ్రాయేలు చరిత్రలో, గిద్యోను కేవలం మూడువందల మంది మనుషులతో మిద్యానీయులను ఓడించిన వ్యూహం కూడా ఇదే (న్యాయాధి. 7:16–23). అబ్రాహాము వ్యూహాత్మకంగా నిలిపిన **మనుషుల్లో** అమోరీయులైన ముగ్గురు సహోదరులకు చెందిన యోధులు కూడా ఉన్నారు. ఈ **బృందం తమ శత్రువుల్ని దమస్కునకు** ఎడమతట్టున్న (ఉత్తర దిశలో ఉన్న) హోబా మట్టుకు తరిమి కొట్టారు.

**వచనము 16**. ఆదికాండము రచయిత తూర్పు రాజుల యుద్ధవిజయాల గురించి ఏ వివరాల్ని ఇవ్వలేదు; అయితే, అబ్రాహాము హారానులో ఉన్నప్పుడు దేవుడతనితో "నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించువానిని శపించెదను" (12:3) అని చేసిన వాగ్దానాన్ని మనం మర్చిపోకూడదు. ఇక్కడ అబ్రాహాము మనుషులు ఓడించిన నలుగురు బలవంతులైన రాజుల సైన్యాల్ని దేవుడు శపించినట్టుగా కనబడుతుంది; ఎందుకంటే వారు లోతును అతని కుటుంబాన్ని అతని పరివారంతోబాటు యావదాస్తితోబాటు చెరపట్టి అబ్రాహాము పట్ల అమర్యాదతో (అగౌరవంతో) వ్యవహరించారు. శత్రువులు దోచుకున్నవాటన్నిటినీ విజేతలు తిరిగి తెచ్చారని తెలియజేస్తూ ఈ విభాగం ముగుస్తుంది. అన్నిటికంటె ముఖ్యమైనదేమిటంటే, వారు తూర్పు రాజులు చెరపట్టుకొనిపోయిన లోతును మరియు అతని ఆస్తి యావత్తు, ఇంకా స్త్రీలను ప్రజలను తిరిగి తీసుకొని వచ్చారు.

# అబ్రాహాము ఇద్దరు రాజుల్ని కలుసుకొనడం (14:17–24)

**[17]అతడు కదొర్లాయోమెరును అతనితో కూడ నున్న రాజులను ఓడించి తిరిగి వచ్చినప్పుడు సొదొమ రాజు అతనిని ఎదుర్కొనుటకు వచ్చి, రాజులోయ అను షావే లోయ మట్టుకు బయలుదేరి వచ్చెను. [18]మరియు షాలేము రాజైన మెల్కీసెదెకు రొట్టెను ద్రాక్షారసమును తీసికొని వచ్చెను. అతడు సర్వోన్నతుడగు దేవునికి యాజకుడు. [19]అప్పుడతడు అబ్రామును ఆశీర్వదించి–ఆకాశమునకును భూమికిని సృష్టికర్తయును సర్వోన్నతు డునైన దేవునివలన అబ్రాము ఆశీర్వదింపబడును గాక అనియు, [20]నీ శత్రువులను నీ చేతి కప్పగించిన సర్వోన్నతుడగు దేవుడు స్తుతింపబడును గాక అనియు చెప్పెను. అప్పుడతడు అన్నిటిలో ఇతనికి పదియవ వంతు ఇచ్చెను. [21]సొదొమ రాజు–మనుష్యులను నాకిచ్చి ఆస్తిని నీవే తీసికొనుమని అబ్రాముతో చెప్పగా [22–23]అబ్రాము–నేనే అబ్రామును ధనవంతునిగా చేసితినని నీవు చెప్పకుండునట్లు ఒక నూలు పోగైనను చెప్పులవారైనను నీవాటిలో ఏదైనను తీసికొనని ఆకాశమునకు భూమికిని సృష్టికర్తయును సర్వోన్నతుడును దేవుడునైన యెహోవా యెదుట నా చెయ్యి యెత్తి ప్రమాణము చేసియున్నాను. [24]అయితే ఈ పడుచువారు భుజించినది తప్ప నాతో కూడ వచ్చిన ఆనేరు ఎష్కోలు మమ్రే అను వారికి ఏయే భాగములు రావలెనో ఆయా భాగములు మాత్రము వారిని తీసికొన నిమ్మని సొదొమ రాజుతో చెప్పెను.**

**వచనము 17.** ఈ వర్ణనలో, సొదొమ రాజు మొదట అహంభావిగా (గర్విష్ఠిగా) ఉండి కదొర్లాయోమెరుతో యుద్ధం చేయడానికి ఉద్యుక్తుడయ్యాడు (14:8, 9). యుద్ధం ప్రారంభమైన తర్వాత, అతని సైన్యాన్ని శత్రువు తీవ్రంగా ఓడించి తన దారికి అడ్డు తొలగించుకున్నాడు; అయితే అతను (సొదొమ రాజు) పారిపోయి మట్టికీలు గుంటలో దాక్కొని ఉండవచ్చు (14:8–10 వివరణలు చూడండి). ఏది ఏమైనప్పటికీ అతను తిరిగి వచ్చి, కదొర్లాయోమెరును ఓడించి విజేతగా నిలిచిన అబ్రాహాము ఎదుట దైన్యంతో చిన్నబోయినవాడై నిలబడినట్లు కథలోని ఈ సందర్భం తెలియజేస్తున్నది.

**షావే లోయలో (అనగా రాజు లోయ)** సొదొమ రాజు అబ్రాహాము ఒకరినొకరు కలుసుకున్నారు. "షావే" అంటే "మైదానం" లేక "లోయ" అని అర్థం. ఈ ప్రస్తావన మరొకసారి 2 సమూ. 18:18 వచనంలో మాత్రమే కనబడుతుంది; తర్వాతి కాలంలో, అబ్షాలోము తనకు కుమారులు లేనందున తన పేరు నిలిచి ఉండేలా అక్కడొక స్తంభాన్ని నిలబెట్టడం జరిగింది. యెరూషలేముకు దక్షిణం మరియు తూర్పు దిశల్లో కిద్రోను హిన్నోము టైరో పియాను లోయలు కలిసిపోయినట్లు ఏకరీతిగా కనబడే ప్రదేశంలో కొద్ది దూరంలో ఉన్న చిన్న మైదానమే షావే అని నమ్మకం.[17]

**వచనము 18. షాలేము రాజైన మెల్కీసెదెకు** కూడా అబ్రాహామును కలుసుకొనడానికి వచ్చాడు. "మెల్కీసెదెకు" అనే పేరుకు అక్షరాలా "నీతికి రాజు" అని అర్థం; మరియు "షాలేము రాజు"గా అతనికున్న గుర్తింపు (ఆనవాలు) "సమాధానపు రాజు" అనే అర్థాన్నిస్తుంది (హెబ్రీ. 7:2). కీర్తనలు 76:2లో యెరూషలేము పూర్వనామం "షాలేము," "సీయోను" అనే పేరుకు సమానార్థకమైన సామ్యంగా కనబడుతున్నది. దావీదు తన శూరులతో బాటు యెబూసీయుల కోట అయిన సీయోనును స్వాధీనపర్చుకొని, అక్కడ తన కొరకు ఒక రాజనివాసమును నిర్మించుకొని, దానికి "దావీదు పురము" అనే పేరు పెట్టాడు (2 సమూ. 5:7, 9; 1 దిన. 11:5, 7). సొలొమోను కాలంలో, దావీదు పురం "సీయోను"గా ప్రత్యేకమైన (విశేషమైన) గుర్తింపు పొందింది (1 రాజులు 8:1).

అబ్రాహాము తూర్పు రాజుల్ని ఘోరంగా ఓడించి అమోఘమైన విజయం సాధించినందుకు, మెల్కీ సెదెకు కృతజ్ఞత చూపినవాడై, యుద్ధం ముగిసిన తర్వాత తమ స్థలాలకు సుదీర్ఘప్రయాణం చేస్తున్న యోధులకు (సైన్యాలకు) సేదతీర్చడంకొరకు మనఃపూర్వకంగా **రొట్టెను ద్రాక్షారసమును** తీసికొని వచ్చాడు. సాధారణంగా సైనికులకు రొట్టెల్ని నీటిని ఆహారంగా ఇచ్చినప్పటికీ, రాజులకు మటుకు రొట్టెల్ని ద్రాక్షారసాన్ని ఇచ్చేవారు (1 సమూ. 16:20). ఇంకా, జంతువుల్ని బలులర్పించేటప్పుడు ఈ పదార్థాలు తప్పనిసరిగా ఉండేవి (సంఖ్యా. 15:2–10; ద్వితీ. 14:22–26; 1 సమూ. 1:14; 10:3). మెల్కీసెదెకు అబ్రాహామును అతని మనుషుల్ని ఆదరించి వారికి రాజభోజనాన్నిచ్చి సత్కరించడం అతని గుణగణాల గురించి తెలియజేస్తుంది. ఇతరుల్ని రక్షించడం కొరకు ప్రాణాలకు తెగించి పోరాడడానికి సుదీర్ఘమైన మరియు అపాయకరమైన యాత్రకు సిద్ధపడినవారిని నిజంగా గౌరవపూర్వకంగా ఆదరించిన మెల్కీసెదెకు మంచితనం మరియు నీతి మూర్తీభవించిన రాజు.

**మెల్కీసెదెకు రాజుగా ఉండడంతో పాటు, సర్వోన్నతుడగు దేవునికి యాజకుడు** కూడా (אֵל עֶלְיוֹן, *'El 'Elyon*). *'El* అనే హెబ్రీ పదానికి "దేవుడు" అని అర్థం; *'Elyon* అనే తమభావార్థక గుణవాచకం (తమభావార్థక విశేషణం) "సర్వోన్నతుడగు" అనే అర్థాన్నిస్తుంది. ఇతర సందర్భాల్లో రెండవ పదం "అధికమైన, (గొప్పయైన)" "సర్వోత్తమమైన" మరియు "ఘనమైన (ఉన్నతమైన)"[18] అనే అర్థాల్ని సూచిస్తుంది. కాబట్టి, భూమ్యాకాశాల్లో సర్వాధికారియైన దేవునికి ఇది తగిన నామధేయం.

కనానీయుల్లో "ఏల్" అనే దైవం, "ఎల్యోన్" అనే మరొక దైవం (అతని మనుమడు) ఉన్నందువలన, మెల్కీసెదెకు "ఏల్ ఎల్యోన్" అనే దైవాన్ని ఆరాధించే అన్యమత యాజకుడని వర్ణించడం జరిగింది. ఈ అభిప్రాయంలో ఉన్న సమస్య ఏమిటంటే, కనాను పురాణాల ప్రకారం ఏల్ మరియు ఎల్యోన్ రెండు వేర్వేరు దైవాలు; వారి సాహిత్యంలో ఈ పేరుతో ఏక దైవం ఉన్నట్టు ఎటువంటి

ఆధారాల్లేవు.[19] ఈ దైవాల్లో ఎవరికైనా యాజకుడుగా ఉంటూ కనానుకు కూడా రాజుగా ఉన్న వ్యక్తి ఎవరైనా తన స్వంత దైవాల్లో ఎవరి పేరు మీదనైనా ఆశీర్వాదాలివ్వడం సంభవం గానీ, అబ్రాహాముకు గానీ అతనితో ఉన్న అమోరీ సహోదరులకు గానీ తెలియనటువంటి సంయుక్త నామం కలిగిన దైవం పేరుమీద ఆశీర్వాదాలివ్వడం అసంభవంగా కనబడుతుంది. ఇంకా, నీతికి మరియు సమాధానానికి నిజమైన రాజైన మెస్సీయకు ఛాయారూపంగా లేక చిహ్నంగా మెల్కీసెదెకును (కీర్తన. 110:1–4; హెబ్రీ. 7:1–4, 17, 21) ఉన్నతంగా చూపడమనేది, అతను అబ్రాహామును కలుసుకొనడానికి పూర్వమే అతనిలో ఈ గుణాలు (ధర్మాలు, లక్షణాలు) ఉండకపోయినట్లయితే అసంభవమనే చెప్పవచ్చు. ఈ రాజు ఎలా నిజదేవుణ్ణి తెలుసుకున్నాడో ఈ వృత్తాంతం తెలియజేయడం లేదు; అయితే, యెహోవా తనను తానే అబ్రాహాముకు వెల్లడి చేసుకున్నట్టుగా (12:1–3; అపొ. 7:2–4), కొన్ని శతాబ్దాల అనంతరం బిలాముకు వెల్లడి చేసుకున్నట్టుగా (సంఖ్యా. 22:1–24:25) ఈ రాజుకు కూడా (మెల్కీసెదెకు) వెల్లడి చేసుకొని ఉండవచ్చు.

**వచనము 19**. అదే సమయంలో మెల్కీసెదెకు అబ్రాహామును, **ఆకాశమునకును భూమికిని సృష్టికర్తయును సర్వోన్నతుడునైన దేవునివలన అబ్రాము ఆశీర్వదింపబడును గాక** అని ఆశీర్వదించాడు. దేవుని యాజకుడుగా, "నీతికి రాజు"గా (హెబ్రీ. 7:2) మెల్కీసెదెకు అబ్రాహామును ఆశీర్వదించడం అతను (మెల్కీసెదెకు) యూదులకు తండ్రి అయిన (పితరుడు) వ్యక్తి కంటె గొప్పవాడని సూచిస్తుంది. రబ్బీలు (యూదియ మతబోధకులు) ఈ విషయంలో తర్జనభర్జనలు పడ్డారు; కొందరు మెల్కీసెదెకు యాజకత్వాన్ని అబ్రాహాము స్థాయి కంటె తక్కువ స్థాయి గలదిగా చూశారు. మరికొందరు అతనొక దేవదూత అనీ, బహుశా ప్రధాన దూత అయిన మిఖాయేలు కావచ్చేమోననీ అభిప్రాయపడ్తూ అతణ్ణి ఉన్నతస్థానంలో ఉంచారు.[20] అయితే, హెబ్రీ పత్రిక రచయిత అతను దైవస్వరూపుడు కాదనీ, అతనొక "ఘనుడు" అనీ, అతని వంశావళి లేక వంశపరంపర (పూర్వీకులు, వారసులు) యూదియ ప్రజలకు తెలియదని తెలియజేశాడు (హెబ్రీ. 7:3, 4). మెల్కీసెదెకు వంశావళి గురించి వివరాలు లేకపోవడం, ఆనువంశికత (వారసత్వం) మాత్రమే యాజకత్వాన్ని నిర్ణయించే ముఖ్యకారకం (ముఖ్యకారణం) అని అభిప్రాయపడేవారి దృష్టిలో అతనికి తక్కువ స్థాయి కలిగేలా చేసింది.

పాత నిబంధన ప్రకారం, ఆశీర్వదించేవారు యాజకుడైనా లేక రాజైనా సరే ఆశీర్వాదం పొందేవారికంటె గొప్ప వ్యక్తి (నిర్గమ. 39:43; సంఖ్యా. 6:22–27; ద్వితీ. 10:8; 2 సమూ. 6:18). "తక్కువవాడు ఎక్కువవానిచేత ఆశీర్వదింపబడునను మాట కేవలము నిరాక్షేపమై యున్నది" (హెబ్రీ. 7:7) అనే ప్రకటనలో మెల్కీసెదెకు అబ్రాహాముకంటె గొప్పవాడనే సూచన నిర్వివాదంగా

కనబడుతుంది. కాబట్టి, భౌతికమైన రాజకీయపరమైన మరియు ఆర్థికపరమైన పరిగణనలు మెల్కీసెదెకు ఘనతకు కారణం కాదనీ, నీతికి రాజుగా మరియు సర్వోన్నతుడైన దేవుని యాజకుడిగా ఆత్మసంబంధమైన విషయాల్లో అతను అబ్రాహాము కంటె ఘనుడని హెబ్రీ పత్రిక రచయిత అతనికి అర్హతనిస్తున్నాడు. 14:22–23లో పితరుడు "యెహోవా" పేరునుపయోగించడం అతను షాలేము రాజుకు నిజదేవుని గురించి నిరూపణాత్మకంగా తెలియజేయడంకొరకు కాదని కొందరి అభిప్రాయం. అతను (అబ్రాహాము) కేవలం యెహోవా స్వకీయ నామాన్నే ఉపయోగించాడు. మరొకటి, మెల్కీసెదెకు అప్పటికే సర్వోన్నతుడైన ఏకైక నిజదేవుని యాజకుడైనప్పటికీ, అతనికి ఈ హోదా గురించి తెలియక పోవచ్చు.

నీతిపరుడైన షాలేము రాజు అబ్రాహామును ఘనపర్చడం (సన్మానించడం), లోతును అతని ప్రజల్ని అతని సంపాద్యాల్ని పట్టుకొనిపోయిన తూర్పు రాజులు అబ్రాహాముపట్ల ప్రవర్తించిన తీరుకు భిన్నంగా కనబడుతుంది. తూర్పు రాజులు అబ్రాహాము బంధువైన లోతుపట్ల చెడుగా ప్రవర్తించడం అబ్రాహామును "వేధించి" బాధపెట్టినట్లేనని (వేదన కలిగించినట్లేనని) 14:14–16 వచనాల్లో గమనించవచ్చు. 12:17, 18 వచనాల్లో అబ్రాహాముతో సరైన సంబంధం లేనందున తమ మీదికి వేదనల్ని తెచ్చుకున్న ఫరో లాగా, బలాధీశులైన వ్యక్తుల గురించి ఇది మరొక దృష్టాంతం (ఉదాహరణ). ఏది ఏమైనప్పటికీ, మెల్కీసెదెకు అతణ్ణి (అబ్రాహామును) "ఆశీర్వదించడం" జరిగింది. అతని ఆశీర్వాదం అబ్రాహాము అన్వేషణకు, సాహసోపేతమైన ఆకస్మిక దాడికి, తూర్పు రాజుల్ని పరాజితుల్ని చేసినందుకు, నిర్బంధంలో ఉన్న మనుషుల్ని వారి ఆస్తుల్ని విడిపించి నందుకు కృతజ్ఞతాభరితమైన భావప్రకటన.

దేవుణ్ణి "ఆకాశమునకును భూమికిని సృష్టికర్త"గా మెల్కీసెదెకు గుర్తించి "సర్వోన్నతుడునైన దేవుని" నామంలో ఆశీర్వదించాడు. "కర్త" అనే అర్థాన్నిచ్చే קָנָה (*qanah*) శబ్దరూపాలు పాత నిబంధనలో పలు చోట్ల కనబడతాయి; ఈ పదాలకు "పొందడం" లేక "తనకొరకు ప్రియమైనవాటిని లేక ఇష్టమైవాటిని ఆర్జించడం"[21] అనే సాధారణమైన అర్థాలున్నాయి. R. Laird Harris ప్రకారం, *qanah* అనే పదం కొన్ని చోట్ల "సృష్టించు లేక సృజించు" అనే అర్థాన్ని కూడా ఇస్తుంది (14:19, 22; ద్వితీ. 32:6; కీర్తన. 139:13; సామెత. 8:22).[22] ఈ సందర్భంలో *qanah* అనే పదం మరింత స్వాభావికంగా "సృష్టికర్త" అనే అర్థాన్నిస్తూ 14:19, 22 వచనాల్లో కనబడుతుంది. ప్రధానమైన (నిర్ణాయకమైన, కీలకమైన) ఏ సిద్ధాంతాన్ని ఇక్కడ పణంగా పెట్టలేదు. భూమ్యాకాశాల్ని సృజించిన (సృష్టించిన) దేవుడు వాటిమీద అధీనత లేక అధీనత్వం (కర్తృత్వం) కలిగి ఉండడా? కాబట్టి, ఈ రెండు అర్థాలు (సృష్టించడం, పొంది ఉండడం లేక కర్తగా ఉండడం) దేవుని గురించి నిజమైన దృక్పథాన్ని (దృగ్గోచర రూపాన్ని, లేక దృగావరణాన్ని) ప్రదర్శిస్తున్నాయి. దైవజ్ఞానసంబంధిత దృక్పథంనుండి (వేదాంతపరమైన

దృక్పథం) చూచినట్లయితే, దేవుడు భూమ్యాకాశాల్ని సృష్టించిన సర్వశక్తిమంతుడు, వాటిమీద అధీనత కలిగిన కర్త మరియు తన సృష్టిని కొనసాగించువాడు కాబట్టి ఈ రెండు అనువాదాల్లో ఏదో ఒకటి లేక ఈ రెండూ సరియైనవిగానే (ఖచ్చితమైనవిగానే) కనిపిస్తాయి.

**వచనము 20**. మెల్కీసెదెకు తన ఆశీర్వాదాన్ని కొనసాగించాడు. అబ్రాహాము తన స్వంత పరా క్రమాన్నిబట్టి యోధుడిగా విజయాన్ని సాధించలేదని, అతను మరియు శిక్షణపొందిన అతని మనుషులు (అలవరచబడినవారు) బందీలను వారి ఆస్తుల్ని విడిపించడానికి దేవుని సాధనాలుగా ఉన్నారని గుర్తించాడు. కాబట్టి, అబ్రాహాము **శత్రువులను** అతని చేతి కప్పగించినవాడు **సర్వోన్నతుడగు దేవుడు** మాత్రమేనని[23] రాజు రూఢి పరుస్తున్నాడు (ధ్రువపరుస్తున్నాడు). “శత్రువులను” (צַר, *tsar* నుండి) అనే పదాన్ని “అణచివేసేవారు” అని కూడా అనువదించవచ్చు; ఎందుకంటే ఈ పదం, యుద్ధంవంటి సందర్భాల్లో ప్రజల్ని అణచివేసి వారికున్నవాటన్నిటినీ దోచుకొని వారిని మానసికక్షోభకు భయభ్రాంతులకు గురి చేయడాన్ని వర్ణిస్తుంది (యిర్మీయా 6:24).[24]

దేవుడు తూర్పు రాజుల్ని అబ్రాహాము చేతులకు అప్పగించినందు కుగాను, మెల్కీసెదెకు ఆశీర్వదించి నందుకు, పితరుడు అన్నిటిలో రాజు/యాజకుడికి **పదియవ వంతు ఇచ్చెను** అని ఉంది. దశమాంశాన్ని (పదవ వంతును, దశమ భాగాన్ని) ఇచ్చే అలవాటు ప్రాచీన పశ్చిమాసియాలో చాలా కాలం క్రితమే ఉండేది. ప్రజలు దశమాంశాల్ని దేవాలయాల్లో యాజకుల పోషణార్థం, మరియు రాజులకు రాజనివాసాల వ్యయం నిమిత్తం ఇచ్చేవారు.[25] రాజుగా యాజకుడుగా దశమాంశాల్ని స్వీకరించేందుకు మెల్కీసెదెకు రెండు విధాలుగా అర్హుడు; అయితే మెల్కీసెదెకు విశేషించి షాలేములోని కనానీయుల్లోని అన్యదైవాలకు యాజకుడైనప్పుడు అబ్రాహాము అతనికి దశమాంశాల్ని ఇవ్వడం తీవ్రమైన సందిగ్ధానికి దారి తీస్తుంది. నిశ్చయంగా మెల్కీసెదెకు అబ్రాహాము ఆరాధించే దేవుణ్ణే ఆరాధించిన యాజకుడై ఉన్నందువలనే, అబ్రాహాము అతనికి యుద్ధంలో వెనుదిరిగి పారిపోతున్న రాజులనుండి తాను తిరిగి సంపాదించినవాట న్నిటిలో పదవభాగాన్నిచ్చాడు. అతను ఈ విధంగా చేయడంవలన, అతను తన సంతతివారు, అనగా యాకోబు (28:22), మరియు ఇశ్రాయేలీయులు దేవుణ్ణి సేవించేవారికి ఆశీర్వాదంగా ఉండడంలో తనను అనుసరించడంలో వారికి ఆదర్శంగా (మాదిరిగా) నిలిచాడు (లేవీయ. 27:30–33; సంఖ్యా. 18:21–32).

**వచనము 21**. కథాగమనం ఇక్కడ సొదొమ రాజు వైపు మలుపు తిరిగింది; అబ్రాహాము పట్ల ఇతని వైఖరి, మెల్కీసెదెకు అబ్రాహాము పట్ల చూపిన వైఖరికి పూర్తిగా భిన్నంగా ఉంది. సొదొమ రాజు పితరుణ్ణి అభ్యర్థించిన తీరు అతని అసంతృప్తిని బయటపెడుతున్నట్టుగా కనబడుతుంటే, మెల్కీసెదెకు రొట్టెను ద్రాక్షా రసాన్ని తెచ్చి అబ్రాహామును ఆశీర్వాదంతో గౌరవించి ఔదార్యంతో నిండిన వైఖరి

చూపించాడు. పైగా, సొదొమ రాజు హఠాత్తుగా (ఉన్న పళంగా) అభ్యర్థించడం అతనిలో మర్యాద గానీ కృతజ్ఞతగానీ ఏ మాత్రం లేవని తెలియజేస్తుంది. **మనుష్యులను నాకిచ్చి ఆస్తిని నీవే తీసికొనుము** అని అర్థమిచ్చేది హెబ్రీ భాషలో కేవలం ఆరు పదాల్లో కూర్చబడింది. విజేతయైన అబ్రాహాముకు యుద్ధంలో తాను పోరాడి స్వాధీనంచేసుకున్న కొల్ల సొమ్మును పంచడంలో సంపూర్ణమైన నిర్ణయాధికారం ఉంది. అబ్రాహాము తానే మనుషుల్ని ఆస్తుల్ని తీసి కొని వెళ్లిపోతాడేమోనని సొదొమ రాజు భయపడి ఉండవచ్చు.

**వచనములు 22, 23**. ఓటమిపాలై చిక్కుల్లోపడి కలవరంతో నిండిన సొదొమ రాజుకు అబ్రాహాము ఇచ్చిన ప్రత్యుత్తరం అతను ఆస్తుల్ని స్వాధీనం చేసుకొని ధనవంతుడు కావడంకొరకు యుద్ధంచేయలేదని తెలియజేసింది. పైగా అబ్రాహాము, యుద్ధంలోనుండి తెచ్చినవాటిలో ఒక నూలు పోగైనను చెప్పులవారైనను లేశ మాత్రమైనా తనకొరకు తీసికొనననని అప్పటికే **ఆకాశమునకు భూమికిని సృష్టికర్తయును సర్వోన్నతుడును దేవుడునైన యెహోవా** యెదుట నా చెయ్యి యెత్తి ప్రమాణము[26] చేసి ఉన్నాడు. ఈ ప్రమాణంచేత అబ్రాహాము యెహోవా తనను ఆశీర్వదిస్తాడని ఆయనలో తనకున్న నమ్మకాన్ని రుజువు చేశాడు. అబ్రాహాము అతని మనుషులు యుద్ధంలో సాధించిన ఏ విజయాల్నిబట్టియైనా భూలోకరాజుల్లో ఎవరికీ ఋణపడి ఉండవలసిన అవసరం లేదు. పైగా, సొదొమ రాజు గుణం గురించి అబ్రాహాముకు అప్పటికే స్పష్టంగా తెలుసు. అతను నేనే అబ్రామును ధనవంతునిగా చేసితినని ఎప్పటికీ చెప్పుకొనే వీలు లేకుండా పితరుడు యుద్ధంలో తాను స్వాధీనం చేసుకున్న **కొల్లసొమ్ములో ఏ మాత్రం** తనకొరకు తీసుకొనడాన్నైనా ఒప్పుకొనలేదు.

**వచనము 24**. కొల్లసొమ్ము తీసుకొనే విషయంలో అబ్రాహాము తన వ్యక్తిగత నిర్ణయాన్ని యుద్ధంలో తనకు సహాయపడిన మిత్రులమీద బలవంతంగా రుద్దలేదు. యుద్ధంలో పోరాడిన పడుచువారు తమ దేహ దార్ఢ్యత కొరకు అప్పటికే కొన్ని ఆహారపదార్థాల్ని భుజించి ఉన్నారు. తమ ప్రాణాలకు తెగించి పోరాడిన ఆనేరు ఎష్కోలు మమ్రే అనేవారు స్వాధీనంచేసుకున్నవాటిలో న్యాయబద్ధంగా తమకు వచ్చే భాగాన్ని వారు వదులు కోవాలని అబ్రాహాము ఎదురుచూడలేదు. కాబట్టి, సొదొమ రాజు అనుమతితో సంబంధంలేకుండా వారి భాగా లేవో ఆ యా భాగములు వారిని తీసికొననిమ్ము నిఅబ్రాహాము తన నిర్ణయం తెలియజేశాడు.

## అన్వయము

### అబ్రాహాము “ఆశీర్వాదము”గా ఉండడం (13:5–7; 14:1–24)

12:2 వచనంలో దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానంలో ఒక భాగం: “నీవు

ఆశీర్వాదముగా నుందువు" అని నిర్దేశిస్తోంది. 13, 14 అధ్యాయాల్లో ఆయన దీనిని నెరవేర్చడం ఆరంభించాడు.

*అబ్రాహాము లోతుకు ఆశీర్వాదంగా ఉన్నాడు.* ఆది. 12:1–3 వచనాల్లో దేవుడు అబ్రాహామును పలువిధాలుగా ఆశీర్వదిస్తానని వాగ్దానం చేశాడు. పాఠ్యభాగం మధ్యలో దేవుడు అబ్రాహామును ఇతరులకు "ఆశీర్వాదము"గా ఉండమని ఆజ్ఞాపించాడు. ఏదేమైనా, పన్నెండవ అధ్యాయం తరువాత భాగంలో (చివరి సగంలో) అబ్రాహాము ఆశీర్వాదంగా ఉండడానికి బదులు, ఐగుప్తులో ఫరో ఇంటివారిమీదకు శాపాలు (మహా వేదనలు) రావడానికి కారణమయ్యాడు. ఇది, అతను శారాగురించి ఆమె తన భార్య కాదని ఆమె తన సహోదరి అని అసత్యం పలికేలా తీసుకున్న నిర్ణయం వలన కలిగిన ఫలితం (12:13, 17). చివరికి అబ్రాహాము ఈ అనుభవంనుండి పాఠం నేర్చుకున్నాడు. అతను అతని పరివారం కనానుకు తిరిగి వచ్చిన తర్వాత, అతని పశువుల కాపరులకు లోతు పశువుల కాపరులకు మధ్య వివాదం తలెత్తినప్పుడు, అబ్రాహాము తన బంధువైన లోతు తాను నివసించాలనుకున్న భూభాగాన్ని కోరుకొనేలా ముందుగా అతనికి అవకాశాన్నిచ్చాడు. లోతుకు దగ్గర బంధువుగా అబ్రాహాముకు తాను మొదటగా కోరుకొనే హక్కు మరియు తన సోదరుని కుమారుడైన లోతును వ్యతిరేక దిశకు వెళ్లమని చెప్పే అధికారం ఉన్నప్పటికీ, ఇలా చేయడంవలన అంటే లోతుకు మొదటగా అవకాశాన్నిచ్చి అబ్రాహాము నిశ్చయంగా లోతుకు ఆశీర్వాదమయ్యాడు. అబ్రాహాము లోతుకు ఐగుప్తునుండి తీసికొని వచ్చిన సంపదల్లో భాగాన్నిచ్చి మరొక విధంగా కూడా లోతుకు ఆశీర్వాదమయ్యాడు (13:5, 6 చూడండి).

క్రొత్త నిబంధన ప్రకారం, తన ప్రజలు ఇతరులకు ఆశీర్వాదంగా ఉండాలని దేవుడు కోరుకుంటూనే ఉన్నాడు. క్రైస్తవులు "మేలు కలుగుటకు కీడు" చేయకూడదని (రోమా. 3:8) దేవుడు ఖచ్చితంగా కోరు కుంటున్నాడు; ఇటువంటి పనులు (కీడులు) ప్రజలు దేవుణ్ణి మహిమపర్చేలా చేయడానికి బదులు ఆయణ్ణి దూషించేలా చేస్తాయి (రోమా. 2:24; 2 పేతురు 2:2). కొండమీద ప్రసంగంలో, యేసు (ఈ మాటల్నే ఉపయోగించకపోయినప్పటికీ) శిష్యులు తమ చుట్టూ ఉన్నవారికి ఆశీర్వాదంగా ఉండాలని వారికి బోధించాడు. ఆయన, "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" (మత్తయి 5:16) అని చెప్పాడు. పేతురు ఈ సత్యాన్నే విడమర్చి, క్రైస్తవులు "ఆశీర్వాదమునకు వారసులవుటకు" గాను "పిలువబడితిరి" అని ఎత్తి చెబ్తూ ఆ కారణంచేత వారు చేయవలసిన పని గురించి "కీడుకు ప్రతికీడైనను దూషణకు ప్రతి దూషణయైనను చేయక దీవించుడి" అని చెప్పాడు (1 పేతురు 3:9). "దీవించుడి" అనేది "దేవుడు మిమ్మల్ని దీవించు గాక" అని కేవలం మాటల్లో పలకడానికి మాత్రమే పరిమితం కాదని, క్రియల్ని

సూచిస్తుందని పేతురు భావన. “కీడునుండి తొలగి మేలు చేయవలెను” (1 పేతురు 3:11) అని పేతురు తన పాఠకుల్ని ఉపదేశపూర్వకంగా హెచ్చరించాడు.

*అబ్రాము ముగ్గురు అమోరీ సోదరులకు ఆశీర్వాదంగా ఉన్నాడు.* నలుగురు తూర్పు రాజుల సైన్యాలు తమకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన అయిదుగురు రాజుల్ని ఒంటరుల్ని చేయడం కొరకు మృత సముద్రం నలుదిశల్లో అంటే ఉత్తరం తూర్పు దక్షిణం పశ్చిమ దిశల్లో ఉన్న నగరాలమీద పడి దాడిచేసి ధ్వంసం చేయడం, సమీపంలోనే ఉన్న అబ్రాహామును ముగ్గురు అమోరీ సోదరుల్ని గొప్ప అపాయంలోకి నెట్టింది. తూర్పునుండి వచ్చిన నలుగురు రాజులు, అయిదుగురు రాజులతో యుద్ధం చేయడానికి పూర్వమే, అబ్రాహాము అమోరీ సోదరులైన ఆనేరు ఎష్కోలు మమ్రే అనే ముగ్గురితో స్వీయరక్షణకొరకు అంటే ఆత్మరక్షణ కొరకు (నిబంధనాపూర్వకమైన) మైత్రీబంధాన్ని ఏర్పరచుకున్నాడు (14:13).

అమోరీయుల సంఖ్యాబలం ఎంతో, వారిలో యుద్ధంలో పోరాడగల యోధులెందరో మనకు తెలియదు; అయితే అబ్రాహాముకు మూడు వందల పద్దెనిమిది మంది యుద్ధాభ్యాసం చేసిన మనుషులున్న స్వంత సైన్యం ఉంది. శత్రుసైన్యంనుండి తమకు ఏ దిక్కునుండైనా అపాయం పొంచి ఉన్నందున అమోరీయులు అబ్రాహాము సైన్యం తమకు సహాయపడాలని కోరుకున్నారు. పైగా, అబ్రాహాము తనగురించి అంటే నిజమైన దేవుడు తనను పిలిచిన పిలుపుగురించి అమోరీ సోదరులకు చెప్పి ఉండవచ్చు. బహుశా వారు యెహోవా అబ్రాహామును గొప్ప సంపదలతో ఆశీర్వదించాడని అర్థం చేసుకొని ఉండవచ్చు.

నలుగురు తూర్పురాజులమీద విజయం తర్వాత, యుద్ధంలో సాధించిన విజయానికి మరియు మనుషుల్ని ఆస్తుల్ని తిరిగి ఇచ్చే విషయంలోను పితరుడు తనకు గొప్పతనాన్ని ఆపాదించుకొనకపోవడం అన్యులయెదుట మంచి సాక్ష్యంగా ఉంది. అబ్రాహాము, “ఆకాశమునకు భూమికిని సృష్టికర్తయును సర్వోన్నతుడును దేవుడునైన యెహోవా” అని స్తుతించాడు (14:22) గనక అతను “అన్యజనులకు వెలుగై” ఉన్నాడని (גּוֹיִם, *goyim*, అన్యజనులు; యెష. 49:6) తెలుస్తోంది.

అబ్రాహాము అన్యజాతుల్లోని ప్రజలకు ఆశీర్వాదంగా ఉండే ప్రక్రియను మొదలుపెట్టాడని తెలుస్తోంది; అతని సంతతివారైన ఇశ్రాయేలీయులు దీన్ని కొనసాగించాలి. చాలా కాలం తర్వాత, సీనాయి పర్వతం దగ్గర దేవుడు తన ప్రజలు, “యాజకరూపమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను” ఉండాలని వారితో చెప్పాడు (నిర్గమ. 19:6). ఇశ్రాయేలు రక్షణ ఒక ముగింపు కొరకు కాదు. యాజకరూపమైన రాజ్యంగా, దేవునిచేత ఎన్నికైన ప్రజకు (జాతికి) కలిగిన రక్షణ వారితరులకు ఆశీర్వాదాలకు మార్గంగా ఉండడం కొరకు, దేవుడెవరు మరియు ఆయన సర్వప్రజల్ని రక్షించి ఆశీర్వదించడంకొరకు ఏం చేయనున్నాడనే సత్యాన్ని తెలియజేసే మాధ్యమంగా ఉండడం కొరకు కూడా. వారు అన్యప్రజలు తమ అసత్యదైవాల్ని విడిచిపెట్టి, యెహోవాను సేవించేలా వారిని నడిపించ వలసి

ఉన్నారు.

కొంతమంది అన్యప్రజలు ఈ సందేశాన్ని అందుకొని, నిజదేవునివైపు తిరిగారు. మిద్యాను యాజకుడైన యిత్రో (నిర్గమ. 18:1–12); మరియు వేశ్య అయిన రాహాబు (యెహో. 2:9–14; 6:22–25) యెహోవాయందు తమ విశ్వాసాన్ని ప్రకటించారు. మోయాబీయురాలైన రూతు యెహోవా తనకున్న విశ్వాసాన్ని వ్యక్తపరిచి, ఇకనుండి తన దేవుడు ఆయనేనని చెప్పింది (రూతు 1:16, 17). దావీదు శూరుల్లో కొంతమంది, హిత్తీయుడైన ఊరియా వంటి అన్యప్రజల్లోని వారున్నారు (2 సమూ. 23:36–39; 1 దిన. 11:39–46). సింహాసనం మరియు రాజ్యం అబ్షాలోము చేతుల్లోకి వెళ్లినప్పుడు, గిత్తీయుడైన ఇత్తయి దావీదు ఇంకా దేవుని మనిషిగానే ఉన్నాడని నమ్మినవాడై, దావీదుయందు యెహోవాయందు తన నమ్మకాన్ని ప్రకటించాడు (2 సమూ. 15:21). దావీదు ఫిలిష్తీయుడైన ఈ యోధుణ్ణి తన సైన్యంలో మూడవ భాగంమీద అధిపతిగా చేశాడు; ఇత్తయి మరియు అతని మనుషులు దావీదు రాజ్యం అబ్షాలోము నాయకత్వంలో ఉన్న రాజద్రోహుల చేతుల్లో పడకుండా అడ్డుకున్నారు (2 సమూ. 18:1–5). అనంతర కాలంలో యెహోవా దావీదు గురించి, "జనములకు (అన్యప్రజలకు[27]) సాక్షిగా అతని నియమించితిని జనములకు (అన్యప్రజలకు) రాజుగాను అధిపతిగాను అతని నియమించితిని" (యెష. 55:4) అని చెప్పాడు.

*అబ్రాహాము దుష్టులైన సొదొమ ప్రజలకు వారి రాజుకు ఆశీర్వాదంగా ఉన్నాడు.* తూర్పు సైన్యాలు సొదొమ ప్రజల్ని ఇతర నగరాల ప్రజల్ని వారి వారి ఆస్తులతోబాటు ఇంకా లోతును కూడా చెరపట్టుకొని వెళ్లాయని అబ్రాహాము విన్నవెంటనే కార్యోన్ముఖుడయ్యాడు. అతను తన దగ్గర ఉన్న కొద్ది మంది యోధులతో మరియు ముగ్గురు అమోరీ సోదరుల సైన్యాలతో తూర్పు సైన్యాల్ని తరిమి కొట్టాడు. లోతును రక్షించడం అత్యవసరం కాబట్టి అతని పెత్తండ్రి లోతుకొరకు తన ప్రాణాన్ని పణంగా పెట్టడానికి సైతం వెనుకడుగు వేయలేదు. అయితే దుర్మార్గులైన సొదొమ ప్రజల సంగతేమి? సొదొమ ప్రజల దుర్మార్గం ఎంత నీచమైనదంటే వారి దుర్మార్గాన్నిబట్టి తర్వాత ఈ మైదానంలోని నగరాలన్నిటిని ప్రజలతో సహా దేవుడు నాశనం చేయవలసి వచ్చెను (19:24, 25)? చెరపట్టుకొనిపోయినవారినుండి విడిపించడానికి లోతు గానీ, సొదొమ ప్రజలు గానీ అర్హులా కాదా అనేదాని మీద అబ్రాహాము నిర్ణయం తీసుకొనలేదు గానీ, వారు నిస్సహాయులని వారి పక్షాన ఎవరైనా జోక్యం చేసుకొనవలసిన అవసరం ఉందనే వాస్తవం పైనే అతను నిర్ణయం తీసుకున్నాడు.

అబ్రాహాము చర్యలు దేవుడు తన ప్రజలు ప్రతి తరంలోను తమ పొరుగువారిపట్ల ఎలా ప్రతి స్పందించాలని కోరుకుంటున్నాడో తెలియజేసే చక్కని దృష్టాంతంగా (ఉదాహరణగా) ఉన్నాయి. దేవుడు ఇశ్రాయేలీయుల్ని, "నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెను" అని ఆజ్ఞాపించినప్పుడు దానికి ముందు

ఆయన, "కీడుకు ప్రతికీడు చేయకూడదు, నీ ప్రజలమీద కోపముంచుకొనక" అని చెప్పాడు (లేవీయ. 19:18). ఈ ఆజ్ఞ విషయంలో తన ప్రజలు తమ ప్రేమను తమపట్ల యుక్తరీతిలో ప్రవర్తించిన నీతిపరులైన హెబ్రీ పొరుగువారికి మాత్రమే పరిమితం చేసుకొనడానికి తగిన కారణాల్ని వెతికే శోధనలో పడతారని దేవునికి తెలుసు. అయితే, కోపపడకూడదు ప్రతికీడు చేయకూడదనే నిషేధార్థకమైన ఆజ్ఞ ఇందుకు పూర్తిగా భిన్నమైన దాన్ని సూచించే భావార్థకమైన ఆజ్ఞ. ప్రేమ పొందడానికెటువంటి అర్హతగానీ యోగ్యతగానీ లేని పొరుగువారిని సైతం ప్రేమించాలని దీని అర్థం.

యేసు "నీ దేవుడైన ప్రభువున ... ప్రేమింపవలెననియు, నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెనని" (లూకా 10:27) రెండు ప్రధానమైన ఆజ్ఞల్ని ఇచ్చినప్పుడు నిశ్చయంగా ఈ భావనయే ఆయన బోధలో కనబడుతుంది. యువకుడైన ఒక ధర్మశాస్త్రోపదేకుడు తనను తాను సమర్థించుకొనడానికి ప్రయత్నిస్తూ తనతో మాట్లాడుతున్న ఆయణ్ణి (యేసును), "నా పొరుగువాడెవడు" (లూకా 10:29) అని అడిగాడు. యేసు అతని ప్రశ్నకు జవాబుగా మంచి సమరయుడి ఉపమానం (కథ) చెప్పాడు; దొంగలు ఒక వ్యక్తిని దోచుకొని అతణ్ణి కొట్టి మరణావస్థలో ఉన్న అతణ్ణి దారి ప్రక్కన పడవేసినప్పుడు మంచి సమరయుడు అతనికి సహాయం చేశాడు. ఈ ఉపమానం చివర్లో యేసు అతణ్ణే (యువకుడైన ధర్మశాస్త్రోపదేకుడు), "దొంగల చేతిలో చిక్కినవానికి ఈ ముగ్గురిలో (యాజకుడు, లేవీయుడు, సమరయుడు) ఎవడు పొరుగువాడాయెను" (లూకా 10:36) అని ప్రశ్నించాడు. ఇక్కడ అసలు ప్రశ్న "నా పొరుగువాడెవరు" అని కాదు గానీ, "నేనెవరికి పొరుగువాడిగా ఉండాలి" అనేదే (లూకా 10:37 చూడండి). దేవుడు తన ప్రజలు ఇతరులకు పొరుగువారిగా ఉండాలని అవసరంలో ఉన్నవారందరికీ సహాయం చేయాలని, అంటే జాతి సామాజిక ఆర్థిక స్థాయి నీతిగలవారా కాదా అనే నైతిక నియమాలకు అతీతంగా అందరికీ సహాయపడాలని కోరుకుంటున్నాడు. తదుపరి కాలంలో పౌలు కూడా ఈ భావననే, "కాబట్టి మనకు సమయము దొరకినకొలది అందరియెడలను, విశేషముగా విశ్వాసగృహమునకు చేరినవారియెడలను మేలుచేయుదము" (గలతీ. 6:10) అని వ్యక్త పర్చాడు. యేసు ఈ ప్రేమగురించి దృష్టాంతపూర్వకంగా వివరించడానికి దాదాపుగా రెండు వేల సంవత్సరాల పూర్వమే అబ్రాహాము తన పొరుగువారిపట్ల ఈ ప్రేమనే ఆచరణీయంగా చూపించాడు.

*అబ్రాహాము మెల్కీసెదెకుకు ఆశీర్వాదంగా ఉన్నాడు.* ధనవంతుడైన ఒక పరదేశి తన చిన్నసైన్యంతో తూర్పు రాజులమీద సాధించిన అపూర్వ విజయంగురించి మెల్కీసెదెకు ఎలా విన్నాడో పాఠ్యభాగంలో వివరాల్లేవు. బహుశా ఈ వార్త త్వరలోనే, మరీ ముఖ్యంగా దాడిచేసినవారు కనాను చుట్టుప్రక్కల్లో ఉన్న నగరాలకు భారీగా ఉపద్రవం కలిగించిన తర్వాత అంతటా వ్యాపించి ఉండవచ్చు.

అబ్రాహాము తూర్పు రాజుల్ని ఓడించడం మటుకే కాదు, అతను సొదొమ ప్రజల్ని వారి ఆస్తుల్ని కూడా రక్షించాడు. మెల్కీసెదెకు ఈ వ్యక్తిని కలుసుకొని అతనికి రొట్టెను ద్రాక్షారసాన్నిచ్చి అతణ్ణి సన్మానించాలనుకున్నాడు; అంతే కాదు, "యెహోవా" అనే వ్యక్తిగత (స్వంత, స్వకీయ) నామం కలిగిన సర్వోన్నతుడైన దేవుని నామంలో అతణ్ణి ఆశీర్వదించాలని కూడా కోరుకున్నాడు. పితరుడు తాను స్వాధీనపర్చుకున్నవాటన్నిటిలో మెల్కీసెదెకుకు దశమాంశాల్ని (పదవభాగం) ఇచ్చినప్పుడు, ఈ పరదేశి నిజదేవునిపట్ల యథార్థమైన నిబద్ధత గలవాడని, కనాను దేశంలో యెహోవాకు ప్రతినిధిగా ఉన్నవానిపట్ల తన నిబద్ధతను ఆచరణీయంగా చూపడానికి సంసిద్ధుడయ్యాడని అతనికి నిస్సందేహంగా తెలిసింది. అబ్రాహాము మెల్కీసెదెకుకు ఔదార్యపూర్వకమైన ఈ బహుమతి (కానుక) నివ్వడంద్వారా, అనంతర కాలంలో యేసు "పుచ్చుకొనుట కంటె ఇచ్చుట ధన్యము" (అపొ. 20:35) అని పలికిన మాటల్లోని సత్యం అతనికి అనుభవపూర్వకంగా అవగతమైందని తెలుస్తోంది.

దశమాంశాల గురించి (దశమభాగం, లేక పదవ వంతు) బైబిల్లో తొలి ప్రస్తావన ఆది. 14:20లో కనబడుతుంది; అయితే ఇది చాలా ప్రాచీనమైన అలవాటు. దేవుని ప్రజలు తమ సంపాద్యాలన్నిటిలో దశమ భాగాల్ని యెహోవాకు, ఆయనే సమస్తంమీద అధీనత (కర్తృత్వం) కలిగినవాడనే భక్తిభావంతో కృతజ్ఞతా పూర్వకంగా సమర్పించారు. మనకున్నవన్నీ ఆయన చేతుల్లోనుండి మనకు బహుమానంగా వచ్చినవే. దేవాలయ నిర్మాణంకొరకు ప్రజలు చూపెట్టిన కుతూహలాన్ని మరియు వారి దాతృత్వాన్ని కళ్లారా చూచిన దావీదు యెహోవాకు ధారాళంగా ఇచ్చి, "ఈ ప్రకారము మనఃపూర్వకముగా ఇచ్చు సామర్థ్యము మాకుండుటకు నేనెంత మాత్రపు వాడను? నా జనులెంత మాత్రపువారు? సమస్తమును నీ వలననే కలిగెను గదా? నీ స్వసంపాద్యములో కొంత మేము నీకిచ్చియున్నాము" (1 దిన. 29:14) అని ప్రార్థించాడు.

పౌలు ఉపయోగించిన పరిభాష దావీదు ఉపయోగించిన పరిభాషకు ప్రతిధ్వనిలాగా కనబడుతుంది; యెరూషలేములో ఉన్న పరిశుద్ధుల అవసరాల కొరకు ఐరోపాలో చిన్నాసియాలో (ఆసియా మైనరు) అన్య ప్రజలున్న సంఘాలనుండి కానుకలు (విరాళాలు) సేకరించిన సమయంలో పౌలు కొరింథులోని సహోదరుల్ని ఇష్టపూర్వకంగాను దాతృత్వంతోను ఇవ్వాలని వారిని ప్రోత్సహించాడు (1 కొరింథీ. 16:1–4). దావీదు కాలంలో దాతృత్వానికి ఏది మూలమై ఉన్నదో (ఆధారమై ఉన్నదో), అంటే దేవుడు తన ప్రజలకు దయాపూర్వకంగాను ఉదారంగాను ఇవ్వడం, క్రైస్తవ దాతృత్వానికి కూడా అదే మూలం (ఆధారం) కావాలని పౌలు నొక్కి చెప్పాడు. ఖచ్చితంగా ఇవ్వాలని పౌలు ఆజ్ఞాపించకపోయినప్పటికీ, వారి ప్రేమలోని యథార్థతను రుజువుచేసుకొనే అవకాశాన్ని తాను ఇస్తున్నానని అతను సంఘానికి గుర్తు చేశాడు. పౌలు, "మీరు

మన ప్రభువైన యేసు క్రీస్తు కృపను ఎరుగుదురు గదా? ఆయన ధనవంతుడైయుండియు మీరు తన దారిద్ర్యమువలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను" (2 కొరింథీ. 8:9; మరియు 9:7–15 చూడండి) అని చెప్పాడు.

---

## సూచనలు

[1]బబులోను భాషలో ఈ పేరు యొక్క రూపం (*âl*) *Larsa* ("లార్సా పట్టణము") అని మరియు పురాతన సుమెరులో దీని పేరు "అరర్వ" ("వెలుగు స్థలము") అని Charles L. Feinberg చెబుతున్నాడు. (Charles L. Feinberg, "Ellasar," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982], 2:73–74.) కొందరు "ఎల్లసారు"ను దక్షిణ బబులోనులో ఉన్న లర్సాతో (సూర్యదేవుని యొక్క పట్టణము) గుర్తించినప్పటికీ, "అరియోక్" అను రాజు యొక్క పేరుకు వాయువ్య మెసొపొతమియలోని ఒక ప్రాంతము తగినదిగా కనిపిస్తుంది. [2]K. A. Kitchen, *On the Reliability of the Old Testament* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 2003), 320. [3]David M. Howard, Jr., "Siddim, Valley of," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 4:499–500. [4]*Genesis Apocryphon* 21. [5]Michael C. Astour, "El-paran," in *The Anchor Bible Dictionary*, ed. David Noel Freedman (New York: Doubleday, 1992), 2:423. ప్రాచీన కనానులో దక్షిణంగా ఏలతు వైపు సాగిన విశాలమైన ఎడారి ప్రాంతంలో పారాను అరణ్యం ఉంది; ఇందులో సీనాయి అరణ్యంలో కొంత భాగం కూడా ఉంది. [6]అమోరీయుల దుర్గాలు తూర్పువైపు (సంఖ్యా. 21:13, 21–31) మరియు పడమరవైపు (యెహో. 7:7; 10:5–12) చెదరి ఉన్నాయి. [7]Duane E. Smith, "Bitumen," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:521. [8]Josephus *Antiquities* 1.9. [9]John T. Willis, *Genesis*, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1979), 227. [10]హెబ్రోను సమీపంలో ఉన్నలోయకు ఎష్కోలు అనే పేరు కూడా ఉంది (సంఖ్యా. 13:23, 24). ఈ పేరుకు "[ద్రాక్ష] గెలలు" అని అర్థం.

[11]"హెబ్రీ" అనే నియమిత నామం "ఎబెరు" (10:21–25; 11:14–16) నుండి వచ్చి ఉండవచ్చు; ఎందుకంటే ఈ రెండు పదాల్లోను అవే మూడు హల్లులు עבר (*'br*) ఉన్నాయి. క్రీస్తు శకం 800 వరకు, హెబ్రీ భాషలో అచ్చుల్ని వ్రాయడం ఉండేది కాదు కాబట్టి ఈ పదానికి వేర్వేరు శబ్దోచ్చారణలు ఎలా రూపొందాయో మనకు ఇతమిత్థంగా తెలియడం లేదు. [12]అంతే గాక, "*'apir* మరియు *'ibr* లను జతపరచాలని చేయు ప్రయత్నం సాధ్యముకాని ద్వంద్వ పరివర్తనలో" పదములలోని హచ్చులను హల్లులను కోరుతుందని పురాతన సెమిటిక్ భాషలు తెలుపుతాయి. (Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 1–17*, The New International Commentary on the Old Testament [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1990],

405.) [13]ఈ అనువాదం NASB యొక్క కొన్ని ప్రతులలోని మార్జిన్ వ్యాఖ్యలలో ఇవ్వబడినది. [14]Bruce K. Waltke, *Genesis: A Commentary* (Grand Rapids, Mich.: Zondervan Publishers, 2001), 232. [15]"బంధువు" అను మాటకు హెబ్రీ పదము אָח (*'ach*), ఇదే నామవాచకమును "మేము సోదరులము" అను వ్యక్తీకరణలో కూడా చూడవచ్చు. [16]Victor P. Hamilton, "חָנִיךְ," in *TWOT*, 1:301. [17]Michael C. Astour, "Shaveh, Valley of," in *The Anchor Bible Dictionary*, 5:1168. [18]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *A Hebrew and English Lexicon of the Old Testament* (Oxford: Clarendon Press, 1962), 751. [19]Michael C. Astour, "Melchizedek," in *The Anchor Bible Dictionary*, 4:684. [20]George J. Brooke, "Melchizedek (11QMelch)," in *The Anchor Bible Dictionary*, 4:687–88.

[21]Brown, Driver, and Briggs, 888–89. [22]R. Laird Harris, "קָנָה," in *TWOT*, 2:803–4. [23]מָגַן (*magan*) అనే క్రియాపదాన్ని "అప్పగించిన" అని అనువదించవచ్చు. ఈ పదానికి, మరియు 15:1లో ఉన్న "కేడెము" (מָגֵן, *magen*) అనే పదానికి మూలపదం ఒకటే. హెబ్రీ పదమూలం ఈ రెండు వృత్తాంతాల్ని చక్కగా అనుసంధానిస్తోంది. [24]Gordon J. Wenham, *Genesis 1–15*, Word Biblical Commentary, vol. 1 (Waco, Tex.: Word Books, 1987), 317; John E. Hartley, "צַר," in *TWOT*, 2:779. [25]ఇలాంటి వాటి యొక్క ఉదాహరణల కొరకు, చూడండి John H. Walton, "Genesis," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Genesis, Exodus, Leviticus, Numbers, Deuteronomy*, ed. John H. Walton (Grand Rapids, Mich.: Zondervan, 2009), 83. [26]అబ్రాహాము యెహోవా వైపు (యెహోవా యెదుట) తన చెయ్యి ఎత్తాడని హెబ్రీ మూలంలో ఉంది; అంటే ఈ పదం అతను ప్రమాణం చేశాడని సూచిస్తుంది. ప్రాచీన కాలాల్లో, చేసిన వాగ్దానాన్ని అమలు చేసే విషయంలో యథార్థతకు సూచనగా చెయ్యి ఎత్తి ప్రమాణం చేయడం నియమితమైన అలవాటు (ద్వితీ. 32:40; యెష. 62:8; దాని. 12:7). [27]పాత నిబంధనలో ఇశ్రాయేలును దేవుని "జనము" అని ఏకవచనంలో సూచించడం జరిగింది (నిర్గమ. 3:7, 10; 4:29–31; 5:1; 19:6–11); అయితే అన్యప్రజల్ని "జనములు" అని బహువచనంలో సూచించడం జరిగింది (నిర్గమ. 19:5; కీర్తన 96:1–13; యెష. 56:6–8), వీరు తన ప్రజల సాక్ష్యంద్వారా రక్షించబడాలని దేవుడు కోరుకున్నాడు.